సవిధ

సాంఖ్యాయన

ఉదయం ఏడు గంటలవుతూంటే విశాలమైన హాలు ఆవులించి కళ్ళుతెరిచింది. పనివాడొకడు గది తలుపులు తెరిచి కర్టెన్లు పైకి వేలాడేశాడు. బయటి కిటికీలు తెరిచాడు. కిటికీలు తెరవగానే కిటికీలో పదిపదిహేను ముఖాలు ప్రత్యక్షమయాయి టీవీలోలాగా. పనివాడు గద్దించాడు.

"తెల్లారిందా ఇప్పుడే?" ఆ ముఖాల్లో సగం మాయమయాయి అక్కణ్ణించి.

"సార్ వస్తాండా?" ప్రశ్నవేసిన తలని చూశాడు పనివాడు. "ఇంక గంటపైమున్నది సారును జూడాల్నంటే" అన్నాడు మూలనుంచి చీపురుతీస్తూ.

చీపుర్ని చూస్తూనే తలలు మాయమైనాయి. పనివాడు గదంతా చిమ్మి కిందపరిచి వున్న పరుపుల మీది దుప్పట్లుదులిపి మళ్ళీ సరిగాపరిచి బాలీసుల్ని సరిచేసి ఫాన్ ఆన్‌చేసి లోపలికి వెళ్ళిపోయాడు.

పాలరాయి గచ్చుపరిచిన ఆ గదిలో కూచోడానికి కుర్చీలకి బదులు పరుపులు బాలీసులు మాత్రమే ఉంటాయి. అయితే వాటిమీద కూచోడానికి ఎవరైనా సరే జంకుతారు. అందువల్ల అవి మాయటం, ఉతకటం అనేది అట్టే ఉండదు. ఆ గది గంభీరతకి మరో కారణం కూడా వుంది. గదికి నాలుగు వైపులా ప్రపంచంలో ప్రస్తుతం ఎగ్జిస్టెన్సులో వున్న హిందూదేవుళ్ళందరి ఫోటోలు వున్నాయి. వాళ్ళ పటాలకి వాళ్ళ ఇష్టాలనిబట్టి చమ్కీదండలు, మల్లెదండలు, మొగలిరేకుల దండలు వగైరాలున్నాయి, పటాల మూలలకి అగరొత్తుల మరకలు కాల్చిన వాతల్లా జిడ్డోడుతూ వున్నాయి. ముఖాలకి గంధం, కుంకుమా పూసివుండి మరుగునపడ్డా ఇతర అవయవాల వల్ల ఫలానాఫలానా దేవతలని తెలుస్తోంది. వీటన్నిటికి చివర్న మార్వాడీ టోపీ, కుంఖం బొట్టూ వున్న మరోమనిషి ఫోటోవుంది. దానికింద "గురూజీ" అని రాసివుంది హిందీలో,

మొత్తానికి ఆ గది మహారాజాగారి దివాన్‌గారి కచేరీ గదిలావుంది. సరిగ్గా ఏడుంపావు అవుతూండగా బిళ్ళకట్టు ధోతీ, బనీనూ ధరించిన ఒక పొడుగాటి సన్నని మనిషి ఆ గదిలోకి ప్రవేశించాడు. అతడి క్రాపు వెనక్కిదువ్వి వుంది.

ముఖాన ఎర్రని తిరుచూర్ణం బొట్టువుంది. అతను అలౌకిక దృష్టివున్నవాడిలా ఆ గదిలోకి ప్రవేశించి దీర్ఘంగా నిట్టూర్చి ఫాన్ ఆఫ్ చేశాడు. తర్వాత లక్ష్మీదేవి పటానికీ, శ్రీకృష్ణుడి పటానికీ ఓ రెండు అగరొత్తులు వెలిగించి మూలల్లో గుచ్చాడు. లక్ష్మీదేవి పటానికి తైలదీపం వెలిగించి కర్పూర హారతి ఇచ్చాడు. ముందు వాయవ్య దిశగా వున్న ఆంజనేయుడికి సాష్టాంగ దండ ప్రణామం చేశాడు. తర్వాతలేచి అతడి వైపు చేతులు జోడించి ఏదో ప్రార్థన పది నిమిషాల పాటు చేశాడు. పక్కనే ఉన్న సరస్వతికి ఓ దండం మాత్రం పెట్టి లక్ష్మీదేవివైపు తిరిగి మరో సాష్టాంగ దండం పెట్టి మరో పది నిముషాలు మంత్రాలు చదివాడు. తర్వాత వినాయకుడూ, శంకరుడూ, శ్రీరాముడూ, మహా విష్ణువూ, అందరికీ నమస్కార మాత్రపు మర్యాదలుచేసి ఆఖర్న శ్రీకృష్ణ భగవానుల వారివైపు తిరిగాడు. వారి ఫోటోలు చాలా ఉన్నాయి. శ్రీకృష్ణ-రాధ, వస్త్రాపహరణ దృశ్యం, కాళీయ మర్దనం, బృందావనకృష్ణ, పార్థసారథికృష్ణ, విశ్వరూప కృష్ణుడు, ఇలా అనేక రకాలు. వీటన్నిటికీ తలా ఐదు నిమిషాల చొప్పున కేటాయించి ఆఖర్న మూడు ఆత్మ ప్రదక్షిణాలుచేసి తర్వాత పరుపుల మీద కూచున్నాడు. అక్కడేవున్న హిందీ దిన పత్రికనోదాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

తర్వాత సరిగ్గా అదే వేషంలో వున్న మరో మనిషి ఆ గదిలోకివచ్చాడు. అతడు కాస్త పొట్టిగా వున్నాడు. అతడి ముఖం ఏవో దురూహలు చీకట్లలా పరుచుకుని ముఖాన్ని మలినం చేసినట్టుగా ఉంది. అతడు గదిలోకి రాగానే పరుపు మీద ఓ దగ్గిర పడివున్న ఐదుపైసల నాణెం కన్పించింది. చటుక్కున దాన్నందుకుని బొడ్లో దోపుకుని లక్ష్మీదేవి పటం వైపు తిరిగి సాష్టాంగ దండ ప్రణామంతో తన పని ప్రారంభించాడు. అంతకు ముందు సన్నటి పొడుగాటి వ్యక్తి చేసినట్టే ఈ మనిషి గూడా దేవతార్చన కార్యక్రమం సాగించాడు.

కిటికీలోంచి ఈ తతంగాలన్నీ గమనిస్తున్న జనం విసుక్కున్నారు. తమ మాటలు వినపడే అవకాశం లేదనుకున్న వాళ్లొకరిద్దరు "వీని శానసపు నోట్లె నా........" అని తిట్టుకుని బీడీలు వెలిగించారు.

వాండ్లిద్దరూ నగరంలో లీడింగ్ లాయర్లు. అన్నదమ్ములు గూడాను. వాళ్లెంత ఆచార పరాయణులంటే కోర్టులో తాగడానికి మంచినీళ్ళు కూడా ఇంటి

నుంచే మరచెంబులో తీసుకువెళతారు. బయట వచ్చి మంచినీళ్ళు కూడా ముట్టని మార్వాడీ బ్రాహ్మలు !

కాసేపు అన్నదమ్ములిద్దరూ పేపరు చదివాక లోపలి గదుల్లోకి వెళ్ళిపోయారు. అప్పుడు ఎనిమిదిన్నర అవుతోంది. ముందుగదిని చిమ్మిన నౌకరు తలుపుతెరిచి బయటికోసారి తొంగి చూసి మళ్ళీ లోపలికి వెళ్ళిపోయాడు.

బయటి జనం ఆ చల్లని శీతాకాలపు ఎండలో ఎండ కాగుతూ చుట్టూ బీడీ కాలుస్తూ కూచున్నారు తప్ప లోపలికి వచ్చి కూచోలేదు.

"ఈ ముండకొడుకులకింత భక్తేందయా?" ఒక కోమటి షాహుకారు పక్కవాణ్ని అడిగాడు.

"ఏమయో సౌకారీ! నువు అయ్యప్ప వేషం ఏత్తలేవా? గట్లనే ఇదొక వేషం!" ఇంకోడన్నాడు.

"ఏత్తె ఏశినగని మరీ గింత ఇదాసయ?" షావుకారు అన్నాడు.

"ఎవరితీరు వాల్లది" మరో మధ్యవర్తి భాష్యం.

"సాగుతె అన్ని నడిపిత్తరు."

"ఇంతకు వీల్లు మల్ల ఎప్పుడు బయటికత్తరో గద!" ఓ పల్లెటూరి ఆసామీ అన్నాడు.

"తొమ్మిది కానిదే రారు ఇంక లోపలి అగ్రల పూజలులేవు?" ఒకడన్నాడు.

ఇంతలో ఇద్దరు యువకులు ఆ వీధిలోకి ప్రవేశించారు.

"అగో మున్షీలు వచ్చిన్రు" ఒకడన్నాడు.

ఇద్దరు వకీలు గుమాస్తాలు జనాన్ని సమీపిస్తుండగానే జనం వాళ్ళని ఎదుర్కొని "మా ఫైలు జర ముందుగాల పెట్టు" అని ఎవరికి వారే బతిమాలుకున్నారు. ఆ మున్షీలు ఇవన్నీ విననట్టే "అరె ఉండుండ్రివయా" అని జనాన్ని తోసుకుని వెళ్ళారు గదిలోకి. ఆ సరికే వాళ్ళ జేబుల్లోనూ, చేతుల్లోనూ కొన్ని నోట్లు నిండాయి. అక్కడున్న జనమంతా ఆ ఇద్దరు లాయర్ల క్లయింట్లు. వాళ్ళలో దరిద్రుని నుంచి లక్షాధికార్లదాకా ఉన్నారు.

పావుగంట తర్వాత మున్షీలు బయటికివచ్చి "బయటనే వుంటారా! సార్లు వచ్చి కూసున్నరు రాండ్రి" అన్నారు.

క్లయింట్లందరూ గుమ్మం బయటనే చెప్పులు విడచి లోపలికెళ్ళారు. లోపలికి వెళ్ళగానే కుర్చీలో కూర్చున్న లాయరు కన్పించాడు. రెండు చేతులూ జోడించి నమస్కారం చేశారు అందరూ. ఒక ముస్లిం వ్యక్తి మాత్రం సలాం చేశాడు. లాయరు అతన్ని గుర్రుగా చూశాడు. అతను సలాంచేయటం ఒక తప్పు. వకీలుకి రెండుచేతులా నమస్కారంచేయాలి ఎవరైనా సరే. ఎందుకంటే అది మన సాంప్రదాయం. సాంప్రదాయపు వ్యతిరేకత వకీలు సహించడు. బూట్లున్నాయి, అది రెండోతప్పు. పవిత్రమైన ఆ గదిలోకి ఎవరూ చెప్పులతో రాకూడదు. నిజానికి ఆ వకీళ్లిద్దరూ వాళ్ళగదిలో కూచునివుండగా చూస్తే మందిరంలోని మహంతుల్లా వుంటారుతప్ప వకీళ్ళలా వుండరు.

మున్షీ ముస్లిం వ్యక్తిని బయటికి లాక్కెళ్ళాడు. అందరివైపు చూస్తూ "ఎవరో బీడీ తాగి వచ్చినరు?" అన్నాడు ముఖంచిట్లించి. చాలా కాలంగా ఇక్కడే స్థిర పడ్డందువల్ల తెలుగుబాగానే మాట్లాడుతారు అన్నదమ్ములిద్దరూ కాస్త ఔత్తరాహిక యాసతో.

ఆ మాటలకి అక్కడున్న ఐదారుగురు మూతులు ముడుచుకున్నారు. లాయరు విసుక్కున్నాడు. "పొగ తాగటంమంచిది కాదు. అది మన అచారం కాదు." అని బోధించాడు. అక్కడున్న అందరూ తలాడించారు.

"ఊఁ ఏమి షావుకారిగారూ పైసల్ తెచ్చినరా?" అన్నాడు షావుకారిని చూస్తూ లాయరు.

"అయ్యా, తెచ్చినగని పని ఐద్దంటూరా?" షావుకారు సంశయించాడు "అంతా పైసల్ పైసల్ తోటి ఉన్నది. అక్కడ క్లర్కుకు ఇయ్యాలె. బెంచి గుమాస్తాకు ఇయ్యాలె. జడ్జిసాబ్‌కు నేను స్వయంగ ఇస్త. మీకేం ధోకాలేదు. పైసా ఇస్తే కానిదిలేదు" అన్నాడు లాయరు.

షావుకారు నోట్లు సమర్పించుకున్నాడు. అతన్ని వెళ్ళమని ఇంకో అతన్ని "సాక్షులను సంపాదించినవా?" అనడిగాడు.

వాడు తెల్లమొగం వేశాడు. "నాకూ నాపెళ్ళానికీ మధ్య సాక్షులెవరుంటారండీ?" అన్నాడు.

"మరి ఆమె నగలన్నీ తన తల్లిగారిచ్చినవే అంటే ఎట్ల?" లాయరు అడిగాడు.

"నగలు నేనే కొన్నానండీ. బిల్లు ఉంది నా దగ్గర" అన్నాడతను.

"బిల్లు మీద పేరు నీదే కాని డబ్బు ఎక్కడిది? అది నేనే ఇచ్చినా నంటే?" లాయరు గారి ప్రశ్నకి తలపట్టుకున్నాడా మనిషి.

"అందుకే చెప్తున్న. ఆనగలూ, వాటితోపాటు పదో, ఇరవయో వెయిల నగదూ తీసుకుని ఆ మనిషి ఇల్లు విడిచి పోయిందని కేసు పెడదాం" లాయరు గారి సలహాకి తలూపాడు ఆ వ్యక్తి.

"రెండ్రోజుల తర్వాతరా" అని అతన్ని పంపించాడు.

మరోవైపు తిరిగి "మీరిచ్చిన కాయితం కోర్టులో రెండేళ్ళ కిందటే ప్రొడ్యూస్ చేసినట్టు రికార్డు పుట్టించాను. పైగా జడ్జీ గూడా అప్పటివాడే అవటం వల్ల తిప్పలేమీ కాలేదు. కానీ కట్నం చాలదంటున్నారు" అన్నాడు.

లోపల ఈ విధంగా జరుగుతూంటే బయట ఒక కారు ఆగింది. దాన్లోనించి గుమ్మటంలాంటి ఓ వ్యక్తి, లావుగా పొడుగ్గావున్న మరో వ్యక్తి దిగారు. ఇద్దరూ బిళ్ళకట్టు ధోవతీలు లాల్చి ధరించారు.

గుమ్మటం లాంటి వ్యక్తి మెడలో రుద్రాక్షలు, నుదుట కుంకం బొట్టూ వున్నాయి. తల అంట కత్తెర వేయించి వుంది. ముఖం విశాలంగా విశాఖ సముద్రపొడ్డులా వుండి ఆ ముఖంలో పెదాలు ఓరుగల్లు మట్టికోట గోడల్లా పొడుగ్గానూ, మందంగానూ వున్నాయి. నోటినిండా తమలపాకు ఉండి "ళ" కార యుక్తంగా ప్రతి మాటనీ ఉచ్చరిస్తున్నాడు. ఆయన పేరు సదాహారరావు. ఎప్పుడూ దేన్నో ఒక దాన్ని హరాయించుకోందే నిద్ర పట్టదతనికి.

ఇంకోవ్యక్తి పొడుగాటి లాల్చి మోకాళ్ళదాకా ధరించాడు. అతని కను బొమలు దుబ్బుగా వుండి కళ్ళ మీదికి పడుతున్నాయి. అతని ముఖంనిండా అన్ని కోరికలూ తీరిన ఋషులకుండే సౌమ్యతవుంది. ఐతే ఋషుల్లో విశ్వామిత్రుడి స్వభావం అతడిది.

ఆ ఇద్దరూ అన్నదమ్ములు. ఇద్దరూ వకీళ్ళే.

కారు దిగాక ఇద్దరు మార్వాడీ లాయర్ల గదుల్లోనూ వున్న క్లయింట్ల రద్దీని చూశాక తమ్ముడు వకీలు నొసలూ, పెదవీ విరిచి

"శీళ్ళంతా క్ళయింట్ళేళా!" అని తమలపాకు యాసతో ఆశ్చర్యపోయాడు.

"దాంట్లో ఆశ్చర్యమేముంది? షావుకార్ల వ్యాజ్యాలన్నీ ఇక్కడికే రెండువేల స్టాండర్డు కేసులున్నాయి ఇద్దరికీ కలిపి. ఇవిగాక నూరో నూటే భయ్యో సుప్రీంకోర్టు కేసులు!" అన్న వకీలు అన్నాడు.

త.వ. ఉక్కిరిబిక్కిరయి తమలపాకుని ఉమ్మేశాడు. "ఏమిటీ?" అని ఆశ్చర్యపోయి బుర్రలో కంప్యూటర్ కన్న వేగంగా లెక్కలు చేసేశాడు.

"రెండువేల కేసుల్ని నెలకొక్కటి సాల్వ్‌చేసినా నూట అరవై సంవత్సరాల ఆరునెల్ల పని! పోనీ ఇద్దరు కల్సిచేసినా ఎనభై మూడు సంవత్సరాల మూడునెలల ప్రాక్టీసు. కేసుకి అధమపక్షం వెయ్యిరూపాయిల ఫీజు వేసుకున్నా ఇరవై లక్షల రూపాయల ఆదాయం" అన్నాడు.

పొడుగాటి మనిషి—అన్న వకీలు—నవ్వాడు. "అది ఇప్పటి పరిస్థితి. తర్వాత ఎంత పెరుగుతుందో?" అన్నాడు.

"అదీ సంగతి! ఈ ముండాకొడుకులు నాకు కొన్ని కేసులు ఎందుకు రిఫర్ చేస్తున్నారో ఇప్పుడర్థమైంది. ఇవన్నీ వీళ్ళ జీవితకాలంలో సాల్వ్‌చేస్తారో లేదో కాబట్టే నాకూ కొన్ని పంపటం" త.వ. అన్నాడు.

"అవి చచ్చుకేసులై వుంటాయి. మంచి ఆదాయం వచ్చే కేసుల్ని వాళ్ళే ఉంచుకుని ఉంటారు" అన్నాడు అ.వ తనరోజుల్ని గుర్తు తెచ్చుకుంటూ. ఆ మార్వాడీ వకీళ్లిద్దరూ అ.వ. దగ్గిరే జూనియర్లుగా చేశారు.

"బాసూ! ఇందాక సుప్రీంకోర్టు కేసులన్నావ్, అవి ఈ వెధవలెలా వాదిస్తారు? వీళ్లేదే!" అన్నాడు తవ.

"సరి! మేమే వాదిస్తున్నామని క్లయింట్లకి పోజిచ్చి అక్కడెవడికో కేసుని అప్పగించి వస్తారు. హైకోర్టులోనే వీళ్లదంటే సుప్రీంకోర్టులో వీళ్ళనెవడు రానిస్తాడు అదంతా టెక్నికస్సమాట!" అవ నవ్వాడు.

"ఎంతయినా, నాయకత్వాన్నీ, పలుకుబడినీ ఇంత వాడుకోవటం నైతిక పతనం కాక మరేమిటి? ఛఛ హిందూ ధర్మాన్ని చివరికి ఇలాగూడా వాడుకునే వాళ్ళు తయారయారు!" తవ నిట్టూర్చాడు.

"ప్రతి ధర్మమూ ఎవడికో ఒకడికి ఉపయోగపడేదే! ఇక లోపలికి వెళదాం" అని అవ దారితీశాడు.

o o o o

ఆ గదిలో పరుపుల మీద ముగ్గురు వకీళ్ళూ, మరో ఇద్దరు షాపుకార్లూ, ఇద్దరు యూనివర్సిటీ రీడర్లూ, ఒక వడ్డీ వ్యాపారీ, ఇంకో ఇద్దరు ముగ్గురు నగర ప్రముఖులూ కూచుని వున్నారు.

ముగ్గురు వకీళ్ళలో ఇద్దరు మార్వాడీ వకీళ్ళే. పోతే మరొకాయన తవ గారు. అవగారు కాంగ్రెసు మనిషి కనుక వీళ్ళతో కల్సి ఉంటాడు తప్ప మీటింగులకిరాడు.

పెద్ద మార్వాడీ సన్నటి కీచుగొంతుకతో ప్రారంభించాడు.

"పన్నెండు వందల సంవత్సరాల కింద ఆది శంకరాచార్యులవారు చేసిన మత సమీకరణ లాంటిది ఇయ్యాళ మళ్ళీ జరుగుతున్నది. ఇది భారతదేశచరిత్ర లోనే పవిత్ర కార్యం. ఈ కార్యనిర్వహణ కోసం మనం మన శక్తి వినియోగించి హిందూధర్మప్రతిష్టాపన చెయ్యాలె" అన్నాడు.

అందరూ తలూపారు. అది పీఠాధిపతుల ఆజ్ఞలాంటిది.

హిందూ మత ఐక్యతకోసం మన పరిషత్ తలపెట్టిన ఈ యజ్ఞ నిర్వహణ కోసం దగ్గర దగ్గర నలభై లక్షల దాకా ఖర్చవుతుందని అంచనా. పోతే అన్ని ఖర్చులూ పోగా రెండు కోట్ల రూపాయలు నిధిగా సేకరించాలని కేంద్ర సంస్థ ఆశిస్తున్నది. దానికిగాను మనం మన జిల్లాలో శక్తి వంచన లేకుండా కృషి చేయాలె"

తవ పెదవివిరిగించి తలూపాడు. అతనికి పాత సంఘటనలన్నీ గుర్తొచ్చాయి. వసూలు చేసిన మొత్తాల్లో భాగాలు ఎలా మాయమయామో స్ఫురించాయి. ఐనా తెలియనట్టుగా అన్నాడు.

"నిశ్రేయస సిద్ధిః యత్ర తత్ర ధర్మః – ధారణా ధర్మ ఇత్యాహుః ధర్మయతే జనః కాబట్టి మనం స్వలాభ కాంక్షలేని కార్యములు నిర్వహించాలె. అప్పుడే అక్కడ ధర్మం నిలుస్తుంది. ఆ ధర్మం మనిషిని కాపాడుతుంది. అట్టి కార్యములు నిర్వహించి జనహితాన్ని కోరటం మన పరిషత్ లక్ష్యం".

పెద్ద మార్వాడీ, చిన్న మార్వాడీ లిద్దరూ తవని ఓరగా చూశారు. వాళ్ళకి ఎక్కడ తగలాలో తగిలింది. స్వధర్మ నిధనం చేసే ధూర్తుడి లాగు కన్పించాడు. త.వ. వారికి. వీడితో లాభంలేదని ఇతర్లవైపు తిరిగి పెద్ద మార్వాడీ అన్నాడు.

మన జిల్లాకు కనీసం పది లక్షల కోటా ఉన్నది. అది వసూలు జెయ్యాలె. ఎట్లయినసరే. షావుకార్లు, ఇతర గృహస్థులు అందరినీ అప్రోచ్ కావాలె. ఊరూరికీ ఒక హుండీ పెట్టి డబ్బు దాంట్లో వెయ్యమని చెప్పాలె. హిందూ ధర్మం గొప్పతనం గూర్చి ఊరూరా బుర్ర కథలు, ఉపన్యాసాలు ఏర్పాటు జెయ్యాలె. వారికి తిండీ ప్రయాణం ఖర్చులూ లోకల్ కార్యకర్తలు చూసుకోవాలె. మనకు మంది తక్కువేం లేరు"

"మరి వాళ్ళకి ఏమన్నా ఇయ్యాల్నా?" వడ్డీ వ్యాపారి అడిగాడు.

"హిందూధర్మం కోసం పని చెయ్యటం మన కర్తవ్యం, దానికి ప్రతి ఫలం అడుగుతారా? స్వయం సేవకులన్న మాటకు అర్థం ఏమిటి?" చిన్న మార్వాడీ అన్నాడు.

అందరూ సంతృప్తిగా తలాడించారు.

తవ గొంతెత్తాడు.

"నహి కశ్చిత్ క్షణమపి జాతు తిష్టత్య కర్మకృత్యో—ఏప్రాణీ ప్రకృతి సిద్ధంగా కర్మ చెయ్యక ఏ క్షణమూ ఎలా ఊరుకోదో అలాచేసే కర్మ హిందూ ధర్మ స్థాపన కోసం చెయ్యటం ప్రతిష్టాకరం. మన ధర్మం అది. ధర్మోరక్షతి రక్షితః గనుక వారు ప్రతిఫలాపేక్ష లేకుండా క్రియాశీలురు కావాలి" అన్నాడు.

యూనివర్సిటీ పండితులు వినుకున్నారు. "బోడిపాండిత్యం వీడూనూ. లింగ ధారుడు మాకన్న ఎక్కువ పండితుడా? పోతన ఉత్సవాల్లో సిల్కులాల్చీ కవి ముందు వాగినట్టనుకుంటున్నాడా ఏమిటి? తడాఖా చూపుదాం" అనుకున్నారు.

వారిలో గొగ్గిపళ్ళ బట్టతల లీడరు గొంతు సవరించుకున్నాడు. ఆయన యూనివర్సిటీకి పాంటూ, షర్టూ, మీటింగులకి లాల్చీ, ధోతీ వేసుకునివస్తాడు. శ్రీవైష్ణవుడు.

"మహాజనో యేన గతః సపంథా-అన్నట్టు మహాజనులు నడిచిందే మార్గం, కనుక హిందూమత పునర్వ్యవస్థీకరణకోసం భగవద్రామానుజులవారు చెప్పిన దగ్గరినుంచి శ్రీ అరవిందులవారి బోధనలన్నీ ఈ సందర్భంగా మనం వెలుగులోకి తీసుకువచ్చి హైందవధర్మాన్ని నూతన మార్గాల్లోకి ప్రవేశపెట్టడం మన ధర్మం కాగలదు" అన్నాడు.

మతపరంగా తాను ఆధునికుణ్ణని ఆయన భావిస్తూవుంటాడు. దుర్గేశ్వర స్వామి ఉలిక్కిపడ్డాడు. ఈ సమావేశంలో స్మార్తులు, వైష్ణవులు ఎవణ్ని వాడు గొప్పచేసుకుంటుంటే తానేనా ఊరుకోవటం!

"మహాశివుని విహారస్థలమైన హిమాలయాల నుండీ శివజటాజూట వాసిని గంగను కొనితెస్తున్న ఈ రథయాత్ర మన జాతికెంతో పుణ్యప్రదాయిని. కాబట్టి దీన్ని పరమ శివకార్యంగా ఎంచవలసి ఉంటుంది. దీనిలో ప్రతి హిందువూ పాలుపంచుకునేటట్టు చెయ్యటం మన కర్తవ్యం" అన్నాడు.

రామమూర్తికి ఒళ్లు మండింది. ఈ ఆరాధ్యుడు తన గొప్పతనాన్ని ప్రదర్శిస్తున్నాడే?

"పరమపవిత్రమైన గంగ మన ఆర్యసమాజానికి జీవప్రదాయిని. వేద భూమియైన అఖండ భారతవర్షంలో గంగను వేదాలు సైతం కీర్తించాయి. ఆ గంగ ఏమతంవారి సొత్తూకాదు. హిందువులందరికీ, ఆ మాటకివస్తే ఏ దేశ నివాసియైనా గంగా దర్శనంతో పాపవిముక్తి పొందుతాడు. అట్టి గంగ - వేద వినుత గంగ మనముంగిటకు రావటం మన జన్మనూ జాతినీ తరింపచెయ్యటానికే ఈ పవిత్రకార్యంలో అందరం భాగస్వాములమే."

రామమూర్తి మాటలు కాస్తవేడిగా అన్పించాయి అందరికీ. పెద్దమార్వాడీ, చిన్నమార్వాడీలిద్దరూ ముఖాలు చూసుకున్నారు.

❊ ❊ ❊

రాబోతున్న ధర్మ గంగాజల రథం, భారతమాతా రథం ఆగేందుకు వేదికనూ' పందిళ్ళనీ అక్కడ నిర్మిస్తున్నారు. కొంత మంది కూలీలు అక్కడ పనిచేస్తున్నారు. పవిత్ర గంగాజలం ఉంచే వేదికను అస్పృశ్యులైన మాలలు నిర్మిస్తున్నారు, వారికి ముత్తడు మేస్త్రీ. వాడికి నడివయసు దాటింది. కంచు విగ్రహంలావున్న మనిషి. మహా భక్తుడు. శ్రీరంగనాయకులపైన వాడికి విప రీతమైన భక్తి. ఎక్కడ హరికథవున్నా, వైష్ణవ సంబంధమైన ఏ వుత్సవం జరుగుతున్నా వాడు కూలీపని సైతం మాని అప్పుచేసుకుని ఆ వుత్సవాలకి హాజరవుతాడు. వాడికి ఈ వేదిక నిర్మించే పని దొరకటం పూర్వజన్మ సుకృ తం అని భావిస్తున్నాడు. రెండు రోజుల్లో రాబోతున్న శ్రీ విష్ణుపాదోదకమైన

గంగాజల భాండాన్ని ఉంచే వేదిక సర్వసుందరంగా ఉండాలని వాడి ఊహాశక్తి అంతా వెచ్చించి దాన్ని నిర్మిస్తున్నాడు. వాడు విశ్రమించక, ఇతర్లని విశ్రమించనీయక అనుకున్నదానికన్న త్వరితంగా పనిని పూర్తి చేయిస్తున్నాడు.

ఆ సాయంత్రం వాడు పనిలో నిమగ్నుడై ఉండగా శాయన్న వచ్చాడు. శాయన్న సాలెవాడు. సంఘ ప్రచారకుడిగా అతడు ఊరిలో కొందరికి తెలుసు.

వచ్చీ రాగానే ముత్తడిని పిలిచి పని ఎంతవరకయిందో కనుక్కునే శాయన్న నాలుగురోజుల్నించి రాలేదు. ఇవాళ వచ్చి ఓ పైపున్న రాళ్ళగుట్ట మీద అన్యమనస్కంగా కూచోడం ముత్తడు చూశాడు. "ఏంది ఇట్లున్నడు?" అని ముత్తడు శాయన్న దగ్గరకు వెళ్ళాడు.

"వందాలయ్యా!" ముత్తడి గొంతువిని శాయన్న తలతిప్పిచూసి దీర్ఘంగా నిట్టూర్చాడు.

"ఎట్లనో ఉన్నరూ?" ముత్తడు అడిగాడు.

సాయన్న నవ్వి మరో మారు దీర్ఘంగా నిట్టూర్చి ఊరుకున్నాడు. ముత్తడు పట్టువదలక పదే పదే అడిగాడు.

"ఇట్లున్నరేందయ్యా!"

శాయన్న మరోసారి నిట్టూర్చి "ముత్తా! మనందరం ఒకటే నంటావా?" అనడిగాడు. ముత్తడు నివ్వెర పోయాడు. ఈ ప్రశ్న వస్తుందని వాడు ఊహించలేదు. "ఏందయ్య! అట్లడిగితిరి?" అన్నాడు.

"ఏమీలేదురా! ఏకాత్మత అన్నది పుస్తకాలల్ల ఉన్నదా లేక నిజంగ సంఘంలో ఉన్నదా తెల్సుకుందామని అడిగిన" అన్నాడు శాయన్న,

"ఈ ముచ్చట ఎందుకచ్చిందయ్యా!" ముత్తడన్నాడు.

శాయన్న చెప్పాడు.

"అరె ముత్తా! నేను సంఘ ప్రచారకుణ్ని. హిందువులంతా ఒకటని నేను చెప్పుతున్న. కానీ నువ్వు నా యింటికి వస్తే గడపబయట వుండి నన్ను పిలువాలె. అప్పుడు నేనే బయటికి వచ్చి నీతోటి మాట్లాడి పంపిస్త. అట్లనే నాకన్న పెద్దకులం వాడు ఎవడితోనైనా నేను మాట్లాడబోతే ముందు గదిలో

మాట్లాడి నన్ను బయటికి పంపిస్తరు, ఇంత తేడా వున్నదిరా. ఇగ మనందరం ఒకటి ఎట్లవుతం?" శాయన్న మాటలకి ముత్తడు నివ్వెరపోయాడు.

పరమధర్మ ప్రచారకుడైన శాయన్నగారేనా ఇలా మాట్లాడుతున్నది?

"అయ్యా! తమరేదో బాధపడుతున్నట్టున్నది. అది నాకు తెలువదిగని మన మతం, ధర్మం చెప్తున్నదాన్ని మనం పాటించాలెగద. లేకపోతె ధర్మం వదిలినవాళ్లం కాదూ?" అన్నాడు,

"అరే ముత్తా! ధర్మం ఏమన్నదిరా? మానవులందరిదీ ఒకే జాతి అన్నది. కులం ఒకటన్నదా? మతం ఒకటన్నదా? కులాలువేరే ఉన్నయన్నది మతమా ధర్మమా? నువు మాలోనివి, నేను సాలోణ్ని. మతం ప్రకారం నేను హిందువును. నువుగూడ హిందువే. మన మార్వాడీ వకీలుగూడ హిందువే. కానీ నా ఇంట్లకు నిన్ను నేను రానియ్యను. తన ఇంట్లకు నిన్నూ, నన్నూ మార్వాడి వకీలు రానియ్యడు, ఎందుకు?"

శాయన్న ముఖంనిండా చెమటనిండింది. అతని మనస్సంతా కల్లోలసముద్రంలా వున్నదని గ్రహించాడు ముత్తడు.

"ముత్తయ్యా! నిన్నింటాకటి నుంచి అరే ముత్తా అని పిలుస్తున్న అది నువ్వు గమనించలేదు. అది నాకూ ఇన్ని రోజులు గమనింపుకు రాలేదు. మన బతుకులల్ల ఇదంత ఇంకిపోయింది. నేను నిన్ను రారా అంటే ఏమనిపించ లేదు నీకు, నాగ్గూడ! అదే నువ్వు నన్ను రారా అంటే నాకు బాధ కలుగుతది. కోపం వస్తది. అట్ల నువ్వనెటానికి వీలులేదు. నాకున్నది. నాకెందుకున్నదంటె మన మతం, ధర్మం నాకా అధికారాన్నిచ్చినయి, నీ నుంచి పీకివేసినయి!" అన్నాడు శాయన్న.

"ఇప్పుడవన్ని ఎందుకు లేన్రి!" ముత్తడు వినయంగా వారించాడు.

"నీకు తెల్వది. మన మతం, ధర్మం నన్ను గొప్పోణ్ని జేస్తున్నాయనుకున్న. మొదలు ఈ బడిపంతులు నౌకరికోసం, తర్వాత దాన్ని నిలుపుకుంటానికి ఈ ధర్మం పట్టుకున్న. గాయత్రీ మంత్రం నదివి మునీశ్వరున్నై పోయిన్ననుకున్న. ధర్మం, ధర్మం అని బడిల శిన్నపోరగాళ్లకుగూడ నా పైత్యమంత ఎక్కిచ్చిన. నేను ధర్మం, మతం అంటున్నకొద్దీ మందికి దూరమైతాన్నని తెలుసుకోకపోయిన" అన్నాడు శాయన్న విచారంగా.

"అయ్యా! ఇయ్యాల మీ మనుసు బాగలేనట్టున్నది. ఏమన్న అనుకోనిది జరిగిందా?" ముత్తడు అడిగాడు.

"అనుకోనిదేం గాదు. కాని అప్పుడు నాకు తోసలేదు. ఇప్పుడు అని పిస్తున్నది. నువు హిందూ ధర్మంలో అంటరానివానివి. నేను శూద్రుణ్ని. నిన్ను పూర్తి కావకా వృత్తికే ఉపయోగించుకుంటరు. నీకన్న నేను కొంత నయం గనుక నన్ను మరికొంచెం ఎక్కువ పనులకు వాడుకుంటరు. కాని ఇద్దరిది పై కులాల వారిసేవే" శాయన్న అన్నాడు.

ముత్తడు నాలిక పళ్ళసందున ఇరికించి ముక్కు మీద వేలేసుకుని "ఇన్ని తెల్సిన మీరు ఇట్ల మాట్లాడుతె అర్థమున్నదా?" అన్నాడు.

"అదే జెప్పబోతున్న. హిందూ మతంల ఇన్ని తేడాలుంటె హిందువు లంత ఒకటెట్లయితరు? అసలు మతం మనుసులను కలుపుతదంటె నాకు నమ్మకం బోయింది. నిన్నటి దాక ఈ ముచ్చట్లు నమ్మినోన్ని, అందరికి జెప్పి నోన్ని నేనేనా అనిపిస్తాంది!" శాయన్న అన్నాడు.

"శ్శె శ్శె! ఆ రంగని దయ గావాలె గని మనసులతోటేందండి?" ముత్తడన్నాడు. శాయన్న నవ్వాడు "రంగనికి గూడ మనసుల దయగావాలె! వానికి గుడి కట్టేదెవడు? కావలు దీసేదెవడు? అదంత పోనీగని ఇప్పుడు నువు జేస్తున్న ఈ ఏర్పాట్లన్ని ఎందుకో నీకెరికేనా?" అన్నాడు.

"ఎందుకేందండీ? గంగారతమొత్తాంది గద. భారతమాత గూడరాబట్టె: అందుకే ఇదంత" ముత్తడు అమాయికంగా అన్నాడు.

"భారతమాత! మట్టికి గూడ మనిషి రూపముంటదా? సరె! ఉంట దనుకో- ఎట్లుంటది? ఊహించి చెప్పు!"

"ఎట్లుంటదంటే....ఎట్లుంటదంటే...." ఊహ అందక ముత్తడు శాయన్న ముఖంలోకి చూసి నవ్వేశాడు.

శాయన్న జేబులోంచి ఒక కాగితం తీసి ఇచ్చాడు. అది ఒక పత్రికలోని కటింగ్. "ఇదెవరో చెప్పు" అన్నాడు శాయన్న. ఆ కాగితాన్ని పరకాయించి చూసి" ఇది కాలికాదేవి ఫోటో గాదండి!" అన్నాడు ముత్తడు

"సరిగా చూడు!"

"అదేందండి అట్లంటరు? సింపమెక్కి ఉన్నది. చేతుల ఏవో అత్తారలున్నాయి. కాలికాదేవే. అదేంది కిరీటం గూడ ఉండె!" ముత్తడు ధృవీకరించాడు.

"ఇదే మన భారతమాత!" శాయన్న అన్నాడు.

"కాలికాదేవి భారతమాత ఎట్లయిద్దండి?" ముత్తడు నోరు వెళ్ళబెట్టాడు.

"ఎట్లయిద్దంటె చేస్తె అయిద్ది. ఆ నడుమ పోతన పండుగ జరిగింది సూశినావు! మవు నీల్లు గూడ మోశినవు! అగో ఆ పండుగల పోతన బొమ్మ పెద్దది గీయిచ్చిన్రు. ఆ పోతన్న అనెటాయినె పచ్చి నాలుగైదు వందలేండ్లు అయితాంది. ఇప్పుడాయినె బొమ్మ గావాలె గాభటి గీపిచ్చిన్రు. అది ఎట్లున్న దెరికేనా? మన నరహరిరావు సాబ్ లేడా ఢిల్లీల? గాయినె పోలికలతోని ఉన్నది. ఎందుకంటె ఆ మీటింగులు జరుగటానికి ఆయినే ముఖ్యకారణం కాబట్టి మెహర్బాని కోసం అట్ల గీపిచ్చిన్రు. బొమ్మ నొసట బొట్టుగూడ ఆయినె మత ప్రకారం పెట్టిన్రు. గట్లనే ఈ భారతమాత బొమ్మగూడ ఎరికేనా?" అన్నాడు శాయన్న.

"మరిగంగారతం సంగతేంది! అది నిజం గంగ కాదా?" ముత్తడడిగాడు. "నిజం గంగే! ఐతే ఏంది? నీరు సహజసిద్ధమైంది. దానికి లేనిపోని పవిత్రత అంటగట్టి మాయ జేస్తున్నరు. పారే నీల్లు శుభ్రంగ ఉంటయి. నిలువ నీల్లు మురిగ్గుంటయి. అంతేగని నీరెక్కడైనా నీరే. గంగకున్న తేటదనం వర్దన్నపేట వాగుకూ్కడ ఉంటది" అన్నాడు శాయన్న.

"ఏందండి మీరు ఇయ్యాల పూర్తి కిలాఫ్‌గ మాట్లాడుతాండ్రు? గట్ల ఎక్కన్నన్న జరుగుద్దా?" అన్నాడు ముత్తడు కొంచెం నొచ్చుకుని.

"ముత్తయ్యా! నీకన్న ఎక్కువ మంది పెద్దల తోటి తిరిగినవాన్ని, ఎక్కువ పుస్తకాలు చదివినవాన్ని! నాకే ఇట్ల అనిపిస్తున్నదంటే నేను ఎంత తెలుసుకోని ఉండాలె? బోధ్ తాలూకా ఎరికేనా? ఆదిలాబాద్ జిల్లాల ఉన్నది. ఏదో పనిమీద నేనక్కడికి ఓసారి పోయిన. మన సంఘపు పోరగాళ్ళు అక్కడ గంజాయి తాగుతాన్రు. గొండ్లోల్లను బెదిరిచ్చి ఈతకల్లు తాగుతాన్రు. వీల్లు మనోల్లే కదా అని అక్కడి సావుకార్లు ఈ పోరగాల్లందరికి అడిగినంత

సందాలిత్తరు. వీల్లు అదంత మింగి కూసుంటరు. ఏదన్న మీటింగుల లొల్లి బెట్టటానికి, భారత్‌కుజై అనెటానికి తప్ప ఈ కోతుల మంద ఎందుకు పనికి రారు. మనోల్లని కడుపుల బెట్టుకునుడే గని మన మీద మనకే నమ్మకంలేదు"

శాయన్న మాటలు ముత్తడు నమ్మలేదు. "ఎహె మరీ ఇచ్చంత్రం జేత్త రేముండి? గంత అన్నాలంగుంటదా మన సంఘం?" అన్నాడు.

"నేను సూశినయి గాబట్టి నీకు నమ్మకం లేదు సరె! ఈ వూర్లనే, నీ ఎదురుగ్గ ఉన్నది జెప్పుత. అది గూడ గాదంటవా? సూద్దాం!" అని శాయన్న మీద వున్న అంగవస్త్రింతో ముఖం తుడుచుకుని మళ్ళీ అన్నాడు.

"మన వకీల్ సాబ్ సదాహరరావు ఉన్నాడు గద! ఆయన కతేంది? ఆయినేమొ మన సంఘంల ఉంటడు. ఆయినె అన్నదమ్ము లిద్దరేమొ — ఒకడు ఎప్పుడు స్టాండర్డుగ కాంగ్రెస్ పార్టీల వుంటడు, ఇంకోడు ఏది అధికారంల వుంటె దాంట్ల వుంటాంటడు. మొత్తానికి ఎవలధికారంల కచ్చినా అన్నదమ్ముల ముగ్గురికి లాభమే. ఇక అన్నదమ్ములల్ల ఇప్పుడు అధికారపార్టీ ఎమ్మెల్యేగ ఉన్నోడు తక్కువ కులపు ఆమెను పెండ్లి జేసుకున్నడు. ధర్మంచెడ్డదన్నం. అందరం ధర్మద్రోహి అని తిట్టినం. కాని ఈ అన్నదమ్ములిండ్లల్ల ఏ పండుగైనా, ప్రబోజనమైనా. ఆమెను వదిలి వీన్ని ఒక్కన్నే పిలుస్తరు. వీడు సంకలు, పిర్రలు ఎగరేసుకుంటబొయి సుట్టాలతోని బాగ తినివస్తడు. ఏ శాస్త్ర ప్రకారం వాన్ని పిలుస్తరో, ఏ ధర్మ ప్రకారం వీడు పోతడో ఎవనికి తెల్వది. ఎవరడుగరు. ఆమె అక్కరలేదుగని సుట్టాలకు వీడు గావాలె. వీడు ఎమ్మెల్యే గాకుంట వట్టోడయితె పిలుద్దురా? ఆమెకు జరిగె ఆవమానంల తనకు గూడ భాగమున్నదని వానికి తెలుస్తలేదు. ఇవన్ని జూస్తాంటె హిందూ ధర్మం అన్నదిలేదని నాకు అనిపిస్తాంది" శాయన్న నిట్టూర్చాడు.

"తమ మాటలు నాకు అర్థమైతలేవయ్యా! మీకేందో గట్టి దెబ్బే తగిలింది" ముత్తడు తేల్చేశాడు.

"అవును. నాకు గట్టి దెబ్బే తలిగింది. కని ఆ దెబ్బతోని ఇన్ని రోజుల పైత్యం వదిలింది." శాయన్న తువ్వాలుతో ముఖం తుడుచుకున్నాడు. మళ్ళీ చెప్పటం సాగించాడు.

55

"మొన్న నాల్గు రోజుల కింద పొద్దుగాలనే లేశి సూర్య నమస్కారాలు చేసుకుంటాంటే మన మార్వాడీ వకీలు ఇంట్ల పనిజేశెటోడు సైకిలు మీద ఆదర బాదర వచ్చిండు. వచ్చి "సార్లు తొందరగ రమ్మంటాండ్రు" అన్నడు. నేను వెంటనే సైకిలెక్కి వాని వెంట బొయిన.

అక్కడ అన్న వకీలు, తమ్ముడు వకీలు, మార్వాడీ వకీల్లిద్దరు, అధికార పార్టీ ఎమ్మెల్యే ఇంక శానామంది సావుకార్లు వున్నరు. అందరికీ నమస్కారం జేసి నిలబడ్డ.

అన్న వకీలు మొకం శివుని మూడో కన్ను తీర్గమండుతున్నది. తమ్ముడు వకీలేమొ నిప్పులు తొక్కిన శివసత్తి తీర్గ ఆ గోడ నుంచి ఈ గోడకు ఈ గోడ నుంచి ఆ గోడకు తిరుగుతున్నడు.

శానసేపు ఎవరు మాట్లాడలే. నాగ్గూడ అదంత ఆశ్చర్యంగ ఉన్నది. ఏంది ఇదంత? అనుకుంటుండగానే లోపలి గది నుంచి పరమ శివమూర్తి తీర్గ ఉన్న ముసలాయినె ఉరికొచ్చి "వీడేనా ఆ భ్రాష్టమ్ముండాకొడుకు?" అన్నడు.

ఆ ముసలోడు నా మీదబడి మొకం గోర్లతోని గీకినంత పనిజేశిండు. "దరిద్రపు గాడిదా! కులహీనుడా! ధర్మహీనుడా! నీకు కైలాసం దొరకదుగాక దొరకదురా అప్రాచ్యుడా!" అని తిట్టి "ఛీ ఛీ! ఈ కులహీనుణ్ని ముట్టుకున్నందుకు మళ్ళీ స్నానం చెయ్యాలి" అని లోపలి అర్రలకు బొయిండు. నేను కింద పడబోయి నిలువరించుకోని "ఏందండీ ఇదంత? నన్ను ఈయనెవరో ఇట్లతిడుతున్నడు? అని అడిగిన.

పెద్ద మార్వాడీ నా వైపు కొండెంగ తీర్గచూసి "హిందూ ధర్మకీ పవిత్రతా ఔర్ శ్రేష్ఠతా కీ ప్రచారక్ హోకే ఐసీ స్వధర్మ నిధన్‌కీ తుమ్ కైసే తయార్ హువే?" అన్నడు.

నాకేం అర్థమైత లేదు. "అసలేం జరిగిందండి?" అనడిగిన.

"జాతికే భ్రష్ఠు పట్టిన ఈ రోజుల్లో మనలాంటి వారు చెయ్యగూడని పనిచేశావు" తమ్ముడు వకీలు ఉరుకులు ఆపి అన్నడు.

"తుమ్ ధర్మ్ ఔర్ జాతీకీ ద్రోహీ బన్ గయే, భారత్‌మే ఐసీ లోగోంకో స్థాన్ నహీ హై. హిందుస్థాన్ హిందువోంకా హై, కిసీకా బాప్‌కా మాల్ నహీ!" పెద్ద మార్వాడీ అన్నడు.

ఇంతల లోపలి నుంచి ఇందాక నన్ను బరబర గీకిన ముసలోడు తడి బట్ట గట్టుకోని విభూతి పూసుకోని మళ్ళా వచ్చిండు.

"ఏమిటి ఏమంటాడు గాడిదకొడుకు?" అన్నడు నన్ను జూస్తూ.

"అదేదో మీరే అడగండి" అన్న వకీలు అన్నాడు.

"ఏరా భ్రష్టాకారప్పీనుగా! ఇంత అఘాయిత్యానికి ఎలా పాల్పడ్డావురా? మన ధర్మాన్ని చేజేతులా నాశనం చెయ్యటానికి నీకు మనసెలా వచ్చింది? ఆ శివుడు నన్ను క్షమిస్తాడా అసలు?" ముసలోడు మళ్ళా నా మీద పడబొయిండు గని పెద్ద వకీలు ఆపిండు.

"ఊరికే స్నానం చేస్తె సన్నిపాతం వస్తుంది" అన్నడు.

"జరిగింది జెప్పి తిట్టరాదుర్ని. నా వల్ల జరిగిన అపరాధమేంది?" అని వినయంగ అడిగిన.

"నీకొడుకు సాంబడు, మా దయవల్ల యూనివర్సిటీలో సీటు సంపాదించుకుని ఇవాళ నా కొంపకే ఎసరు పెట్టాడ్రా!" ముసలోడు నందీశ్వరుని తీర్గ రంకె వేసిండు.

నేను ఆశ్చర్యపోయి "అయ్యా! అట్ల ఏదన్న జరుగుతె వానికి నేను చెప్పి మాన్పిస్త. ఇంతకు ఏం జేశిండు?" అన్న.

"ఏం జేశాడంటావేమిట్రా దున్నపోతా! నీకు తెలీకుండానే ఇదంతా జరిగిందా? మా అమ్మాయిని బలవంతంగా లాక్కెళ్ళి ఎక్కడో గుళ్ళో పెళ్ళి జేసుకున్నాడ్రా! నీ జాతేమిటి కులమేమిటి? నీ అంతస్తెక్కడ మా అంతస్తెక్కడ? మా అంట్లు తోమడానిక్కూడా పనికిరాని ముండా వెధవ. మా ఇళ్ళల్లో పాచిపోయిన చద్దెన్నం పందులకు వెయ్యటమెందుకని వీడికి పెడితే తిని పెరిగిన వెధవ–బ్రహ్మ ద్రోహం, జాతి ద్రోహం, వర్ణసంకరం తలపెడతాడా? వాడికి నీ వత్తాసు వుండే వుంటుంది. నూలుపోగులు వడుక్కుని అమ్ముకునే వెధవ్వ జంధ్యం వేసుకోగానే మాతో సమానమవుతావురా? అంట్ల వెధవా!" అని ఆ ముసలోడు ఒకటే ఎగురుడు మొదలు బెట్టిండు. నాకు కండ్లు బైర్లు గమ్మినయి. ఇప్పుడీ పెద్దలకు ఏంజెప్పాలె? నాకొడుకు ఇట్లజేస్తదనుకున్ననా?

నా బోధలు వానికెక్కకపోతె ఒక్కో జీవిది ఒక్కో తత్త్వం అని ఊకున్నగని ఇంతపని జరుగుతదనుకోలె" శాయన్న ఒక్క క్షణం ఆగాడు.

ముత్తడు నోరు తెరిచి వింటున్నవాడల్లా "మీకేగాదు నాగ్గూడసమ్మబుద్ధ యితలేదుండ్రి" అన్నాడు.

సాయన్న నవ్వి "మనం నమ్మనివి ఎన్నిజరుగుతలేవు?" అని "ఇగ ఆ తర్వాత నా కొడుకును, ఆ ముసలోని బిడ్డను పిలిపించి వాల్లిద్దరిని ఎవలిండ్లకు వాల్లను తీసుకపోవాల్నని నిర్ణయించిన్రు పెద్దలు. నేను ఆలోచనలబడ్డ. వాల్లిద్దరు పెండ్లి జేసుకున్నారనబట్టిరి. ఇప్పుడు విడదీస్తె జరిగిన పెండ్లి అబద్ధమైద్దా?

అయ్యా! మీరు జెప్పేది నాకు బుర్రకెక్కలే. మా శాలోల్లందరికి నేనే పురోహితున్ని. అనేక పెండ్లిల్లు నేనే జరిపించిన, ఇప్పుడీ ఇద్దర్ని విడదీస్తె ఈ పెండ్లి తంతు, మంత్రాలు వట్టియేనా? కట్టినతాలి తెంపుతె ఆడది విధవరాలు కాదా?" అనడిగిన. ముసలోడు మల్ల నామీదపడి నా అంగి చింపి నా శెవులు, జుట్టుపిండి–

"ఆ వెధవముండా శాస్త్రం మా కన్న నీకు ఎక్కువ తెలుసా? కోపం వచ్చి తంతే మాయావిడ తాళి ఎన్నిసార్లు తెగింది కాదు! బ్రాహ్మడి మంత్రాలతో కట్టిన తాళి తాళి అవుతుంది గాని ఏ గదిలోనో, గుడిలోనో తాళిగడితే దానికి విలవేమిట్రా?" అన్నాడు.

నాకు మళ్ళా ఒక ఆలోచన వచ్చింది. "అసలు వాళ్ళు తాళి కట్టుకోకనే పోతె?" అన్న.

"అసలు సమస్యేలేదు గదరా శూద్దర గాడిదా! ముందు వాళ్ళెక్కడున్నారో పిలిపించు" అని ముసలోడు మళ్ళా స్నానానికి పోయిండు.

నాదిక్కు అన్న వకీలు, తమ్ముడు వకీలు, మార్వాడీ వకీల్లు, షావుకార్లు అందరు జూస్తున్నరు. అందరికి నన్ను నరికి పారేద్దుమా అన్నంత కోపం ఉన్నట్టున్నది. నేను ఆలోచించిన. మనసు, మాట, చేతలతోని స్త్రీ పురుషులు ఏకమైతే వాళ్లు దంపతులని శాస్త్రం జెప్తున్నది. ఆ శాస్త్రం జెప్పిందని జెప్పి నోల్లుగూడ ఈ పెద్దమనుషులే. ఇప్పుడు ఇద్దరు దంపతులను విడదీ[illegible]వ

రెండ్లకు వాళ్ళను పంపుమంటున్నారు, అంటే వాళ్ళిద్దరు ఏం జేసి వున్నా గూడ వీళ్లకు ఫర్వలేదు. ఎవరింట్ల–ఎవరి స్థానంల వాళ్లు ఉండాలె, అప్పుడు వీళ్ల ధర్మాన్ని నిలబెడుతరు. ఆ ధర్మం హిందూధర్మం! నాకు పులుపరం బుట్టింది. ఇది హిందూ ధర్మమైతె దీన్ని ఆచరించుడెందుకు? లోపల ఎన్ని జేసినా మళ్ల పెద్దమనిషి వేషాలువేస్తె చాలు!

ముసలోడు మళ్లా స్నానంజేసి విభూతి పూసుకోని వచ్చిండు. అప్పుడు నేను ఇట్లన్న.

"భగవద్గీతను ఇన్ని సంవత్సరాలనుండి సదువుతానగని ఇప్పుడు తెలిసింది అర్థం. "చాతుర్వర్ణం మయాసృష్టం" అన్నది కృష్ణుని మాట. ఆయన గొల్లల తోటి తిరుగుతడు. అడవిజాతి గుడ్డేలుగు పిల్లను తాను పెండ్లి జేసుకుంటడు. రాక్షసజాతి పిల్లను తన మనుమరాల్ను జేసుకుంటడు. కని తన పట్టపురాణి రుక్మిణే కావాలె. తన చెల్లె మాత్రం అర్జునున్నే చేసుకోవాలె. అది ధర్మం! ఇప్పుడు మీరుగూడ నాకు జెప్పుతాను.

ఇందరు పెద్దలల్ల నగలతోటి ఊరొదిలిపోయిన బిడ్డను మల్ల ఏమెరుగనట్టు తెచ్చి గొప్పోనికిచ్చి పెండ్లి జేసినోల్లుండవచ్చు. వడ్డీల వ్యాపారంతోటి కొంపలు గూల్చినోల్లు వుండవచ్చు. చందాలు దిగమింగెటోల్లు వుండవచ్చు.

న్యాయవాదులమని అన్యాయాలు జేసెటోల్లు ఉండవచ్చు, కార్మిక నాయకులమని ఖూనీలు జేయించెటోల్లుండవచ్చు. మనోళ్ళకే మార్కులేసే యూనివర్సిటీ పంతుల్లుండవచ్చు. ఇందరు ఇన్ని తీర్ల హిందూధర్మాన్ని కాపాడుతాంటె దాన్ని జెడగొట్టుడు నా ఒక్కనితోని ఏమైతది? నాకొడుకు నాతోని చెప్పిచెయ్యలే. చెప్పుతె ఏం జేద్దునో? అంత అయిపోయింది, ఇది నా చేతుల లేదు. ఇంక మీ ధర్మాన్ని మీరెట్ల నిలుపుకుంటరో మీ ఇష్టం" అని చేతులు జోడించిన.

ముసలోడు "ఒరే నిన్ను ఎన్ని తన్నినా సిగ్గులేదేంరా వెధవా! నేను ఎన్నిసార్లు స్నానం చెయ్యాలిరా?" అని ఒర్రిండు.

"ఇప్పుడు మీరన్న మాటలకు, చేతలకు నేను జవాబిస్తే ఎట్లుంటదో ఆలోచించుకోండి. కాని నేను జవాబియ్య. నా కొడుకుజేసిన పనికి, బా[illegible]యితె

వాన్ని పట్టుకోని హిందూధర్మంల కలుపుత్రని. వాన్ని అనలేక నన్నంటె నేనేం జేస్త?"

"నీ కొడుకు పెద్దకులం పిల్లనుజేస్కున్నదని నీగ్గూడ సంతోషమైవాడి కొమ్ము కాస్తున్నావు" తమ్ముడు వకీలు అన్నడు.

"నేనుముందే జెప్పిన. వాడునాతోని చెప్పిచెయ్యలేదని. అంటెవానికి గూడ నామీద నమ్మకంలేదు. యమ్మే జదివెటోళ్లు తెలివితక్కువ పనులుజేస్తరనుకోను" అని అన్న.

తమ్ముడు వకీలు అన్నడు. "బాగా ఆలోచించుకో! ఇది జాతి సమస్య" అన్న వకీలు అన్నడు. "ఆ అమ్మాయి ఇంటికి రాకపోతే మవు రేపట్నుంచి స్కూలుకు పెళ్లక్కరలేదు. నీ ఉద్యోగం నేటితోసరి!"

నేను తలవూపి బయటికొచ్చిన. ఇప్పటికి నాలుగు రోజులైంది. నా నౌకరీ పీకేసినట్టు ఇయ్యాల పొద్దున్నే కాయితం వచ్చింది" అన్నాడు శాయన్న.

ముత్తప్ప నిశ్చేష్టుడయాడు. హిందూధర్మం ఇంత గంద్రగోళంగా వుంటుందని వాడికి తెలీదు. అది ఉద్యోగాలనేకాదు ప్రాణాలనిగూడా తీస్తుందని వాడికెవరన్నా చెప్పినా నమ్మి ఉండేవాడుకాదు.

* * *

అ.వ., త.వ. లిద్దరూ కోర్టు వరండా మెట్లు దిగి కారెక్కబోతుండగా కాస్త దూరంలో వాళ్లకు కులశేఖరరావు కన్పించాడు. అతడికంట పడొద్దనుకుంటుండగానే ఆయన వీళ్లని చూడనే చూశాడు.

కులశేఖరరావు అవ తవలిద్దరికీ గురుతుల్యుడు. ఆయనంటే అన్నదమ్ములిద్దరికీ పక్కబెదురు.

"ఒరే, మీ సిగలగొయ్య! అన్నట్టు మీకు సిగల్లేవు కాదూ, అప్రాచ్యులయారు. ఇప్పుడేమిటి ఎప్పుడో అయారు. మిమ్మల్ని కలుద్దామని నేనే అనుకుంటున్నాన్రా. నానాటికీ ఇంత చండనాకటానికి అలవాటు పడుతున్నారేమిటా అని అడగటానికీ!" అని కులశేఖరరావు ఆశీర్వచన పనస చదివి అన్నదమ్ములిద్దరూ తేరుకోటానికి కాస్త టైమిచ్చాడు.

అవ తవ లిద్దరూ గింగరాలు తిరిగి తేరుకునేలోగా ఆయన మరో ప్రశ్న వేశాడు.

"ఒరే సదాహరరావూ! ఎప్పుడూ హరాయించుకునే ఉపాయాలేనా? సరే, ఏమి[ట్రా మీ ఏకాత్మతాయజ్ఞ కథా విశేషం?"

సదాహరరావు గొంతులో నములుతున్న తమలుపాకు అడ్డంపడింది. "ఏదో మానవ[ప్రయత్నం లెండి!" అన్నాడు ఇకిలిస్తూ.

"మానవ [ప్రయత్నమేమి[ట్రా? మార్వాడీ [ప్రయత్నం అను!" కులశేఖరరావు అన్నాడు.

"ఏమిటండీ మీ చమత్కారం?" అవ అన్నాడు.

"ఏమిటా నీ పిండాకూడు! ఒరే అపూర్వసహోదరుల్లారా! జడ్జీలూ అధికార్లూ మనాళ్లయితే నెగ్గుకొచ్చినట్టుకాదురా- మీకు డబ్బే ముఖ్యమైతే, పలుకుబడే ముఖ్యమయితే మీరుజెప్పే ధర్మోరక్షతి రక్షితః అనే మాటకి అర్థం ఏమి[ట్రా? శాస్త్రులు చెప్పే ముండాకొడుకులు ఆచరించరేమిరా? మిమ్మల్ని చూసి జనం ఏం నేర్చుకుపోవాలని?" కులశేఖరరావు మాటకి అవ అడ్డు వచ్చాడు.

"ఏవండోయ్, నేను కాం[గెసు వాడిని నాకీమత విశ్వాసాల్లోకన్న [ప్రజాస్వామ్యంలో నమ్మకం వుంది, అది గుర్తుంచుకోండి" అన్నాడు.

"అబద్ధాలు మాట్లాడేవంటే నీ పిండం మురిక్కాలవలో పెట్టిస్తా. నువ్వు కాం[గెసువాడివి[ట్రా? మరి ఈ మతవాద పార్టీవాడితో నీకు పనేమిటి? తమ్ముడు గనక అంటావా? పాలిటిక్సుకీ లైఫ్‌కీ తేడా వుందనా నీ అభి[ప్రాయం?" కులశేఖరరావు మాటలకి అవ గారి దవడలు దగ్గిరపడ్డాయి. ముఖం పక్కకి తిప్పుకున్నాడు.

కులశేఖరరావు తవ పైపు తిరిగాడు. "ఒరే నువు అజ్ఞానంలోవున్నావురా. నీకు జరుగుతున్న విషయాలు తెలీవు. పురాణాలు ఉపనిషత్తులూ వెదికి ధర్మసూ[త్రాలు నీ ప[త్రికలో బాక్సుకట్టి వేస్తే హిందూధర్మం నిలవదురా. ఒకటి చెప్పమంటావూ? అన్ని మతాలకన్నా ముందు నాశనమైపోయేది హిందూమతమే ఎందుకంటే దీన్లో వర్గీకరణలు ఎక్కువ. చాతుర్వర్ణాల్లో శూ[ద్రజాతిని తీసుకో ఎన్నివున్నాయి. దాన్లో రకాలు?- శూ[ద్రులు, మళ్లీ సచ్ఛూ[ద్రులు!! దాంట్లో మళ్లీ రకాలు. అంచేత హిందూమత వినాశం మానవులు వద్దన్నా మార్వాడీలు వద్దన్నా తప్పదు. ఏమిటి? అర్థమైందా!" అన్నాడు.

తవ నీళ్లు నములుతూ అటూఇటూ చూశాడు. కోర్టు వరండాలో లాయర్లూ జనం అటూఇటూ తిరుగుతున్నారు. ఎవడన్నా వింటాడేమోనని తవ భయపడ్డాడు గానీ ఎవడికీ విన్పించనంత దూరంలోనే ఈ సంభాషణ సాగుతోంది; గడియారం చూసుకున్నాడు. ఐదు కావస్తోంది. కోర్టుమూసే వేళయింది.

"టైము లేదండీ; మళ్ళీ తీరిగ్గా కలుద్దాం." త.వ. అన్నాడు.

"నీకు టైమేమిట్రా? నాకు తెలీదూ నువు ఇంటికి వెళ్ళిచేసే పనేమిటో? ప్రాక్టీసు అట్టేలేదు గాబట్టి క్లయింట్లురారు. కాలేజీ కుర్రాళ్లొస్తారు. వాళ్ళకి రేపు ఫలానా కాలేజీలో ఈ గొడవ చెయ్యమనీ, ఫలానా గోడమీద ఈ రాత రాయమని చెప్పటం నీకోపని; ఆ వెధవముండా పనికన్న నాతో మాట్లాడితే నీకు వచ్చే నష్టంలేదుకాని నా ప్రశ్నలకి సమాధానం చెప్పి కదుల్లు" కులశేఖరరావు కారు బానెట్ మీద తిష్టవేశాడు.

అవ తవ లిద్దరూ మొహాలు చూసుకున్నారు. ఎవడిమొహం చూశామో పొద్దున్నే అనుకున్నారు.

"మన జాతీయ ఆర్థిక వ్యవస్థ-అంటేఏమిటో అర్థమైందిరా బడుద్ధాయిలూ. నేషనల్ ఎకానమీ- ప్రస్తుతం మార్వాడీల చేతుల్లో వుంది. కాదని మీరుకాదు గదా మిమ్మల్ని సృష్టించిన మార్వాడీలుకూడా అనలేరు. కాబట్టి కల్చర్ కూడా వాడి అధీనంలో వుండాలి. అందుకే ఈ ఏకాత్మతా యజ్ఞాలు ఇవన్నీను ఏమంటారు?" అన్నాడు.

"శుద్ధతప్పు. మీదంతా వితండవాదం." అన్నాడు అ.వ. "నీకేమిట్రా ఈగోల? కాంగ్రెసు వాడివి. ప్రజాస్వామ్య విశ్వాసం గలవాడివి?" కులశేఖరరావు అన్నాడు. అవ తలఎగరేసి తమ్ముణ్ని చూశాడు. తమ్ముడు తమలపాకు ఉమ్మి గొంతు సవరించుకుని "అఖండ భారతంలో మార్వాడీలు, మనం వేరు కాదు. అందరం ఒకటే" అన్నాడు.

"అదే నేచెప్పబోయేది నీవిలా అనుకుంటున్నావు. కానీ మార్వాడీ అలా అనుకోడు. బొత్తరాహాడు బొత్తరాహాడే. వాడు నిన్ను తన మాయాజాలం కిందికి తీసుకుంటున్నాడు. నీవది గ్రహించలేకపోతున్నావు."

"అదెలాగ!" త.వ. అన్నాడు.

"ఎలాగంటే– ఉదాహరణ నీ నోటితోనే ఇద్దువుగాని! మొన్న దసరాకి మీ పరిషత్ వాళ్లంతా ఏంజేశా(ర్రా?"

"ఏంచేస్తాం? ఏవో ఉత్సవాలు నిర్వహిస్తాం. అదే చేశాం" తవ అన్నాడు.

"అదే ఏమిటీ అని!"

"రామలీలా, కృష్ణ గోపికా నృత్యం ఇలాంటివి!"

"దసరాకి- మన దక్షిణ భారతంలోవున్న ఆచారం శమీపూజ. అంటే ఉత్తర గోగ్రహణం, భారతంలో పాండవులకి సంబంధించిన ఈ పండగని రామాయణంతో ముడిపెట్టడం ఏమిట్రా? ఢిల్లీలో జరిపే రామలీలని మన వూళ్లో జరపటం ఉత్తరాది సంస్కృతిని మనం నెత్తిన పెట్టుకోవటమా కాదా? పైగా నీ "బోధన" పత్రికలో శమీశమయతే పాపం- శమీశత్రు నాశనీ అని దసరా సంచికలో రాసేవుగూడానూ. రాతలకీ చేతలకీ కుదరదా?" కులశేఖరరావు ప్రశ్నకి అవ తవ లిద్దరూ నోరు వెళ్లబెట్టారు.

త.వ. ముందు తేరుకుని "మీరు భారతీయ సంస్కృతిని విభజిస్తున్నారు. అలా చూడటం తప్పు. విజయదశమి మన దేశానికి నిజమైన జాతీయ పర్వదినం సింహం పౌరుషానికీ, మహిషం మలిన తత్వానికీ, జడ స్వభావానికీ, భౌతిక శక్తికీ సంకేతం. ఈ రెంటి పోరాటంలో సర్వాయుధపాణియైన మాతృశక్తికి విజయం తప్పదు. భౌతికవాదం అణగక తప్పదు. విజయదశమి జాతీయశక్తి అంకురానికి శక్తిని సమకూర్చేదిగా మన నాశీర్వదించాలి, జడత్వ రూఢిమత్వ సీమలను ఉల్లంఘించి అంతశ్చేతనను గుర్తించిన నాడే అది సాధ్యం, అదే సీమోల్లంఘనం" అన్నాడు.

"బాగుందిరా వరస! అబద్ధంవా సుబద్ధంవా ఏదో ఒకటి వాగటం దాన్లో నాలుగు సంస్కృత పదాలు ఇరికించటం! ఇది నీ సంఘ సమావేశాల్లో బాగుంటుందిగాని తెలిసిన వారి దగ్గరకాదు. భౌతిక శక్తిని లొంగతీయటం ఏ అభౌతిక శక్తికీ సాధ్యంకాదు. అది నీకు తెల్సు. అందుకే మీరు కమ్యూని్స్టుల్ని మీ వేదాంతంతోనో, తత్వంతోనో గాకుండా భౌతికశక్తితోనే ఎదుర్కొంటారు, చెప్పేదేమో అంతశ్చైతన్యమూ, జాతీయ ప్రేరణా! మహిషాన్ని

జయించే సింహానిదిగూడా భౌతికశక్తే అని మీరు బయటికి ఒప్పుకోరా?" కుల శేఖరరావు ప్రశ్నకి తవ చిరునవ్వునవ్వి లాల్చీ జేబులోంచి ఒక పొట్లం తీసి దాన్లోవున్న తమలపాకు దవడకి కుక్కుకున్నాడు. తర్వాత ఇలా అన్నాడు.

"మనదేశం అగ్నిగర్భ. నేడు అనైక్యతతో, పరదేశ దాస్యభారంతో స్వార్థంతో నివురుగప్పినట్లున్నది. ఆఅగ్ని గర్భను పూజించవలె. వెలువరించు కోవలె. అదే శమీపూజ."

"ఇంకో పది నిముషాలు ఇలాగే మాట్లాడితే నాకు పిచ్చెత్తడంఖాయం. నా ప్రశ్న నీకు అర్థం కావడంలేదా లేక నీ హిందూధర్మ వెర్రి నిన్నువదల టం లేదా? నేనడిగేదేమిటి నీజవాబేమిటి? సరే నీ దోవకి నేనే వస్తాను. ఇందా కేమిటి శమీపూజ అన్నావు కాదూ! విజయదశమి శమీపూజ అయితే మరి రామ లీల జరపడం ఏమిట్రా?" అన్నాడు కులశేఖరరావు.

"బాధ్యతను స్వీకరించే సాహసం కావాలి. సమష్టితత్వం కావాలి. మనదీ సమాజం అన్న దృష్టి రావాలి. ఈ దేశపు సాంస్కృతికైక్యత సాధి స్తున్న మాధ్యమాలు పండుగలు. ఆదాన ప్రదానాలుగా మనం వాటిని స్వీకరిం చాలి. స్ఫూర్తిసోత్రస్వసులైన పర్వదినాలలో జరిగే కార్యక్రమాలలో విపరీతం కన్పిస్తే శాస్త్రీయ విమర్శ చేయవచ్చు." అన్నాడు తవ. అతడి నోట్లో తమల పాకు లాలాజలం నిండటంతో పక్కకి వెళ్ళి ఉమ్మి మళ్ళీవచ్చి,

"భారతీయమైన అనగా హైందవమైన స్వధర్మభావానికి శమీపూజ ఐతే నేం? రామలీల అయితేనేం?" అన్నాడు,

"ఐతే శమీపూజే జరపవచ్చుగదా! పైగా నాకు తెలిసి దసరానాడు శమీ పూజ జరుపుతారు గాని రామలీల జరపరు. ఇప్పుడు మీ పుణ్యమా అని ఇదొకటి దాపురించింది." అన్నాడు కులశేఖరరావు.

"దాన్నే ఏకాత్మత అంటారు. రామలీలని జనం వ్యతిరేకించలేదుగదా! అంటే దాన్ని వారు స్వీకరించినట్టేగదా?" అన్నాడు తవ.

అవ గారికి సందుదొరికింది. "మా ఇందిరమ్మ చెప్పే నేషనల్ ఇంటి గ్రేషన్ కూడా ఇదే" అన్నాడు.

"నాకు తెలీదట్రా? వీడు ఏకాత్మత అంటున్నాడు—నువు నేషనల్ ఇంటి గ్రేషన్ అంటున్నావు. హరికథలకి వచ్చే వాళ్ళంతా శ్రద్ధాసక్తులతో రారని మీకు తెలిసేవుండాలే." అన్నాడు కులశేఖరరావు.

"ఏమిటండీ మీతర్కం? బట్టతలకీ మోకాలికీ ముడిపెడుతున్నారు?" అవ అన్నాడు.

"ఆ పని నాదికాదు మీదే! బ్రిటిషువాడికి వస్తువులమ్ముకోటానికి చోటు చాలక వలసల్నిస్థాపించి ఎక్కడెక్కడీ ప్రాంతాల్ని ఏకం చేసి అక్కడ తన మార్కెట్లని స్థాపించాడు. అలాగే ఇండియాని గూడా జయించి ఏకం చేశాడు. తన మార్కెట్టును వృద్ధిచేసే క్రమంలో వాడాపని చేస్తే దాన్ని పట్టుకుని మీరివాళ అఖండ భారత్ అంటున్నారు. మీది సామ్రాజ్యవాద సేవకసంఘం! మొత్తానికి మీకూ అంతర్జాతీయ ఉందిరోయ్! మరి జాతీయవాదులమంటారే మిత్రా?" కులశేఖరరావు నవ్వాడు.

"మీరు మమ్మల్ని పక్కదారి పట్టిస్తున్నారు. మా పాయింటు మీదనిలిచి మాట్లాడటం లేదు." అన్నాడు తవ.

"పక్కదారి పట్టించేది నేనుకాదు మీరే. వాదనే కాదు జనాన్నే పక్కదారి పట్టిస్తున్నారు. షావుకారు సరుకు అమ్మటం కోసం తన ఏజెంటుని పెడతాడు. సామ్రాజ్యవాదానికి అలాంటి ఏజంట్లు మీరు. టినోపాల్ కంపెనీవాడు డిటర్జెంట్ల యుగం వచ్చాక వెనకపడిపోయాడు. అప్పుడు వాడు రానిపాల్ అనే కొత్త లేబిల్‌తో సరుకుని అమ్మాడు. అలాగే సామ్రాజ్యవాదం నిన్నటిదాకా నేషనల్ ఇంటిగ్రేషన్ అనేనినాదాన్ని ఇందిరతో ఇప్పించింది. ఇందిరమీదజనానికిమోజు తగ్గేసరికి మిమ్మల్ని పట్టుకున్నది. దాన్నే కాస్తమార్చి ఏకాత్మత అని మీనోటితో అనిపిస్తోంది. జనానికిదంతా ఏం తెల్సు? మీలాంటి పెద్దమనుషులేంచెపితే అది వింటారు. మర్చిపోతారు అంతే. కాకపోతే కొంతకాలం వారి మీద ప్రభావం వుంటుంది." కులశేఖరరావు అన్నాడు.

తవ తలెగరేశాడు. "చాల్లెండి మీవాదం! మా ప్రోగ్రాములకు రెగ్యులర్‌గా అటెండయే ఒకాయన ఐదువేలు విరాళం ఇచ్చాడు. ఇంకా ఎంతో మంది ఇచ్చారు. ఎంత ప్రభావితం కానిదే అలా ఇస్తారు?" అన్నాడు.

"ఆ ఇచ్చినవాడు వ్యాపారస్తుడు అయివుంటాడు. లేదా పోలీసాఫీసరో, లంచగొండి అధికారో అయుంటాడు తప్ప సగటు మనిషి అయుండడు. కమ్యూనిస్టుల మీటింగులు విని భూస్వాముల భూములు ఆక్రమించుకున్నవాళ్ళు నేను

చూపిస్తాను. నీహరికథలు, ధర్మబోధలు విని సద్వర్తనులైన వాళ్ళని నువెందర్ని-కనీసం ఒకణ్ని చూపుతావా ?"

"ఒకడో ఇద్దరో జాతికి సంఘానికి ప్రతినిధులుకాదు. మొత్తం జాతీయ స్వభావాన్నిబట్టి జాతి స్వభావాన్ని అంచనావేయాలి" అన్నాడు తవ.

కులశేఖరరావునవ్వి "నువు చెప్పింది విని తలూపడానికి నేను జడ్జీనికాదు. ఇప్పుడునువ్వే ఉన్నావు. ఒక్కణ్ని ఉదాహరణ చూపమన్నప్పుడు నిన్ను నువ్వే చూపుకోవచ్చు. కానీ నీకాస్ఫూహేలేదు. ఎందుకంటే ఏ ధర్మాన్ని నువు బోధి స్తున్నావో ఆ ధర్మం కొనసాగటానికి వీల్లేని, అవకాశంలేని సంఘంలో నువూ అలాగే బతుకుతున్నావు గాబట్టి ! దాన్ని కప్పిపుచ్చుకోటానికి జాతీ, జాతీయ స్వరూపం అని పెద్దమాటలు వాడటం దండగ !" అన్నాడు.

"కమ్యూనిస్టులవాదనలు మనిషిఉద్రేకాన్ని రెచ్చగొడతాయి.మాబోధనలు మనిషిలో ధర్మాన్ని పాదుకొల్పుతాయి. వాళ్ళదిపొంగుకాబట్టి త్వరగా తెలు స్తుంది. మా ధర్మ వృక్షం పెరిగేసరికి ఆలస్యమవుతుంది. అదీ తేడా!"

"నువు పొరబడుతున్నావు. కమ్యూనిస్టులవాదనలు భౌతిక జీవితానికీ, సమస్యలకీ సంబంధించినవి. కనుక మనిషి వెంటనే స్పందిస్తాడు. మీది అలౌకిక విషయబోధన కాబట్టి నిర్లిప్తులవుతారు".

"మీకు సంస్కృతి మీద తేలిక అభిప్రాయమున్నది" అన్నాడు తవ

"ఏడిశావు. సంస్కృతి పట్ల నీకన్న నేనే పిడివాదిని. సంస్కృతి అంటున్నావు ఏదిరా నీ సంస్కృతి?"

"సంస్కృతీ నిర్వచనం కష్టం. మన సంస్కృతి వేదపురాణాల్లో, రామాయణ భారతాల్లో వుంది. అది మన సంస్కృతి. జాతీయత జీవన స్రోతస్సు. అది జీవన విధానం. దాన్ని మీకు అర్థమయేలా చెప్పటం కష్టం." తవ అన్నాడు.

"మరి నాకర్థమయేలా చెప్పటమే కష్టమైతే ఏమీ తెలీని వాడికి ఎలా చెబుతావురా? వాడి అజ్ఞానం మీద ఆడుకుంటావా?" కుల శేఖరరావు అన్నాడు.

"నేను హిందువును. ధర్మగంగ బిందువును. అలాంటి పనులు నాకు రావు" తవ అన్నాడు.

"ఏడిశావు నువు దాక్షిణాత్యుడివి. ఔత్తరాహుల ప్రాబల్యం వున్న సంస్థలో వున్నావు. భారతదేశంలో ఎక్కడైనాసరే ఆ సంస్థాధిపత్యం అక్కడ

సెటిలై వున్న ఔత్తరాహుల చేతిలో వుంటే వాడికింద గులాం గిరీ చెయ్యటానికి నీ సంస్కృతి ఏమైపోయింది? ఆదిశంకరుల తర్వాత మళ్ళీ ఇదే మత యాత్ర అని ఏకాత్మతా రథయాత్రని పొగుడుతున్నారే, పన్నెండువందల ఏళ్ళ కింద శంకరుల దాక్షిణాత్యతత్వం ఔత్తరాహుల్ని గూడా ప్రభావితం చేస్తే ఇవాళ ప్రతీకారమా అన్నట్టు ఉత్తరాది నుంచి ఏకాత్మతా యజ్ఞం ప్రారంభమై హరిద్వారం రామేశ్వరాన్నీ, గంగ కావేరినీ జయించడానికి బయలుదేరింది. ఏమిట్రా గంగకున్న గొప్పదనం? ఆగొప్పదనం గోదావరికీ, కృష్ణకీ, కావేరికీ లేదా? రష్యానీ, చైనానీ, తప్పనప్పుడు అమెరికానీ విదేశీ సంస్కృతి అని విమర్శిస్తావే! నీ మీదే పరాయిసంస్కృతి, నిన్నటిదాకా నీదికాని ఉత్తరాది సంస్కృతి రుద్దబడుతుంటే దాన్ని విమర్శించవా? సంస్కృతిని భారతాన్ని బట్టీ రామాయణాన్ని బట్టీ కొలవగూడదురా! ప్రాంతాన్ని బట్టి కొలవాలి. జీవన విధానం సంస్కృతి కాని పుస్తకాలు కాదు. అధికారం కోసం, డబ్బు కోసం పలుకుబడికోసం పరాయి సంస్కృతికి అక్షరాలా దాస్యంచేస్తున్ననీకుసంస్కృతి గూర్చి మతం గూర్చి మాట్లాడే అర్హతలేదు. ఇదంతా రాబోయే ఎలక్షన్లలో మీ పార్టీని గద్దెనెక్కించే పన్నాగం" కులశేఖరరావు తవని చూస్తూ అన్నాడు. అవగారు బాదాంచెట్టు ఆకుల్ని లెక్కిస్తున్నాడు. నూటఎనభై ఆరులో వున్నాడతను. కులశేఖరరావు అరుపులకి లెక్క మరచిపోయి మళ్ళీమళ్ళీ లెక్కతప్పుతున్నాడు.

"మీకు అర్థమయేలా చెప్పటం ఎలాగో నాకసలు అర్థంకావటంలేదు. మేం హిందూధర్మ ప్రతిష్టాపనకోసం ఈ పని చేస్తున్నాం తప్ప స్వార్థం మాకే కోశానా లేదు" తవ అన్నాడు.

"ఓహో అదా సంగతి! ఐతే రెండుకోట్ల నిధిసేకరణా, ఈహుండీలూ హంగామా ఎందుకురా? ధర్మానికి అర్థంతో పనేమిటి? అర్థబలంతో నిలిచే ధర్మానికి అర్థమూ విలువావుంటాయా? ఈ పేరుతో ఎలక్షన్ ఫండూ, జనాన్ని సమకూర్చుకోవటం రెండూ జరగాలని మీ వుద్దేశంకాదూ! మతం రాజ్యానికి సేవ చేస్తుందని ఎంత చక్కగా నిరూపిస్తున్నార్రా?" కులశేఖరరావు నవ్వాడు.

తవ ముఖం ముటముటలాడించాడు. "డబ్బుని కూర్చుకోవాల్సిన అవసరం మాకేంలేదు. ఉదయపూర్ రాజా, గ్వాలియర్ రాణీ ఉన్నసంఘం మది!" అన్నాడు. అని నాలిక్కరుచుకున్నాడు.

"అదీ సంగతి! కమ్యూనిస్టులకీ ఒక వర్గం అంటూ ఉన్నది చెప్పుకో డానికి. మీకున్నదంతా వర్ణాలే. మీరు వర్గం అనుకునేది చరిత్ర నుంచి తొలగి పోతున్న వర్ణం. దానికి రాజ్యాన్ని నడపగల శక్తిలేదు. పుచ్చిపోయిన తాడుని పట్టుకుని కొండ ఎక్కబోతున్నారు మీరు" అన్నాడు కులశేఖరరావు.

తవలోని భారతీయత వేయిపడగలెత్తి బుసకొట్టింది.

"మీరు అఖండ భారతీయ సాంస్కృతిక స్రవంతిని ప్రాంతీయ తత్వంతో ఖండఖండాలుగా తుండతుండాలుగా ముక్కలుగా చెక్కలుగా పీసెస్ అండ్ ఐటమ్ వైజ్‌గా డివైడ్ చేసి-విభజించి మాట్లాడుతున్నారు. వాట్ సెడ్ ఇన్ ఏన్షియంట్ లిటరేచర్? జంబూద్వీపే, భరతఖండే-వాటీజ్ ఇట్? భారత ఈజ్ అఖండ భారత్! అండ్ ఏన్ అన్ డివైడెడ్ గ్రేట్ లాండ్ విచ్ ఈజ్ ఎ కాంప్లెక్స్ ఆఫ్ మెనీ కల్చర్స్ - వోహై అఖండ భారత్!" తవ గర్జించాడు.

కులశేఖరరావు కారు బానెట్ మించి దిగాడు. తాపీగా అన్నాడు. "తల్లి గురించి మేనమామ దగ్గర మాట్లాడకు. వెంటనే ఇంటికి పోయి శ్రీకారం నుంచి మళ్ళీ చదువుకో. చదువుకుని ఆతర్వాత అందరితో మాట్లాడు. నీ బోర్డూ, నల్లకోటూ తీసెయ్యి. జ్ఞానంకోసం చదువుకో. అన్నీనాకు ముందే తెలుసనే అహంకారంతో చదవకు." అని రెండడుగులువేసి ఆగి మళ్ళీఅన్నాడు. "ఇలా ఎక్కడా వాగకు. తోళ్లు వలుస్తారు" అని వెళ్ళిపోయాడు.

తవ చిన్నబుచ్చుకుని అవ వైపు చూశాడు. అతను బాదాం ఆకుల్ని లెక్కపెట్టి చేతిలోవున్న ఫైలుమీద రెండొంద నలభయ్యారు అని రాశాడు. మళ్ళీపక్కనేవున్న గోరింట చెట్టుని పట్టుకుని లెక్క మొదలెట్టాడు. దూరంగా ఉన్న కొత్త వకీళ్లు అవగారి తరహా చూసి అతనేదో లాపాయింట్ల గూర్చి దీర్ఘంగా ఆలోచించి అవిరాసుకుంటున్నాడేమో అని ఒకరితో ఒకరు చెప్పు కున్నారు.

తవ పక్కకి చూసేసరికి కమ్యూనిస్టు వకీలు పక్కనున్నవాడితో "అందుకే మేం శాంస్క్రిట్ సమాఖ్య అని ఒకటి పెట్టామండీ. అది ఇలాంటి వెధవ రథ యాత్రలు ఇవన్నీ పట్టించుకోదు. ఏమిటండీ ముండాకొడుకులు మరీఇంత మధ్యయుగం మనస్తత్వంగాళ్లా!" అంటూ కదిలి వెళ్ళిపోయాడు.

68

"ఇక వెళదామా?" తవ అవతో అన్నాడు. "తొంభయిఆరు. తొంభయి...."ఆగిపోయాడు. అవ పక్కకి చూసి "వెళ్ళాడా ఆ మహానుభావుడు?" అన్నాడు.

"మొత్తానికి వదిలాడు"

అవ తవ లిద్దరూ కారెక్కారు.

"పద్దెనిమిది వందల ముప్ఫయి" అన్నాడు అవ కారుస్టార్టు చేస్తూ.

"ఏమిటి?" తవ అడిగాడు.

"ఆకులు!" అవ చెప్పాడు.

"బాదాం రెండొందల నలభయ్యారు....గోరింట...." అవ చెబుతూంటే తవ తలకాయ పట్టుకున్నాడు.

విశాలమైదానంలో రెండు రథాలు వచ్చి ఆగివున్నాయి. వేలాది మంది జనం. పరిషత్ కార్యకర్తలు కర్రలు పుచ్చుకుని జనాన్ని అదుపుచేస్తున్నారు. వచ్చిన వాళ్లలో స్త్రీలెక్కువ. నిన్నటిదాకా వేదికని నిర్మించిన ముత్తడు ఇప్పుడు వేదికకు ఫర్లాంగు దూరంలో వున్నాడు. కారణంవాడికే తెలియటంలేదు.

ముందు వేదిక దగ్గరికి అయ్యగార్లు వచ్చారు. ముత్తడు పదిగజాల దూరంలో నిలుచున్నాడు. తర్వాత నగర పెద్దలు వచ్చారు. దాంతో వాడికి వంద గజాలు దూరం వెళ్లక తప్పిందికాదు. క్రమక్రమంగా పరిషత్ కార్యకర్తలు రావటం జనాన్ని అదిలించటం ప్రారంభించాక వాడికి అక్కడ వుండటం సాధ్యంకాలేదు. కానీ ఇంటిముందుకి వస్తున్న గంగాజల సేవనం కోసం వాడు తహ తహ లాడుతూ అక్కడేవున్నాడు. ఫలితంగా వాడికి రెండుమూడు దెబ్బలుకూడా పడ్డాయి.

రథాలు నాలుగింటికి వస్తాయన్నారు, ఆరయింది ఎనిమిదయింది. పదయింది. ఇంకారాలేదు. వెళదామంటే అవేం మామూలు రథాలా? గంగాజల రథాలు! అవి తాగనిదే, తరించనిదే, కదిలేదెలా? క్రమంగా జనం ఎక్కువవుతున్నారు. అందరూ గంగాజలం కోసమే, భారతమాత దర్శనంకోసమే! ఆలస్యం అవుతోంది. ఆలస్యమవుతున్నకొద్దీ జనం పక్కనేవున్న సినిమా హాళ్లలోనూ, బార్ లలోనూ, దూరారు. గంగాజలంతో సమానమైన మధుజలాన్ని సేవించటానికి!

ఇంతమందికీ అంత గంగాజలం ఎక్కడి నుంచి పోస్తారు? ముత్తడను
కున్నాడు. కార్యకర్తలు ఇరవై గజాలలో బిందెపెట్టి దాంట్లో నీళ్లు నింపుతున్నారు.
పిల్లలు అక్కడ రాసి వున్నమాటల్ని "ఏకతాతాయజ్ఞం" అని వేళాకోళం పట్టి
స్తున్నారు.

ఇంతలో ఒక కార్యకర్త ముత్తణ్ని పిల్చాడు. "ఇంత దూరంగా ఉన్న
వేందిరా? ఇటురా!"

ముత్తడు వెళ్ళాడు. ఒకబక్కెటూ, తాడూ వాడిచేతికిచ్చి "అబాయిలనీల్లు
తోడి ఇయ్యిపో. వీల్లు మోస్తరు" అన్నాడు.

ముత్తడు బకెట్టు అందుకొని పరిగెత్తాడు. వాడి వెనకే బిందెలు
పట్టుకొని పదిమంది దాకా ఉరికారు. వాళ్ళంతా ఎన్ని బిందెలు మోశారో,
ముత్తడు ఎన్ని నీళ్లు తోడాడో తెలీదు. రాత్రి పదకొండు కావస్తూండగా
రథాలు వచ్చాయి. ముత్తడు దూరంనించి వాటినిచూసి ఉద్వేగపడిపో డ
ఆ ఉద్వేగంతో నీళ్లని అవలీలగా తోడేశాడు, ఎన్ని తోడినా చాలునని అనరు.
మోసే వాళ్లు ఇంకా వస్తున్నారు. ఒకణ్ని అడిగాడు.

"ఇంక సాలయా?"

"ఏమో! బ్రమ్మలు అన్ని నిండాలన్నారు." వాడు చెప్పాడు. రథాలు
రాకపోవటంతో కోలాహలం మొదలైంది. జనంగోలగా అరుస్తున్నారు. కార్య
కర్తల-కర్రలు పైకిలేచి కిందికి పడుతున్నాయి. అంతటా కాషాయరంగు
జెండాలు, ఓంకార నాదాలు, నినాదాలు మారుమోగుతున్నాయి, హిందూధర్మ
స్వరూపం ఒక్కచోటనే గుమిగూడి నట్టయింది.

బావి అంచుమీద ముత్తడు ఎక్కి రథాల్ని చూశాడు. గంగాజల కలశ
రథం ఇత్తడిరంగులో మెరిసి పోతోంది. దానిమీదబంతిపూల దండలు, కాషాయ
జెండాలు వెలిగిపోతున్నాయి. ముత్తడు అలౌకికానందంలో మునిగిపోయాడు.
చేతులు జోడించి రథాలకే నమస్కరించాడు. భుజంమీద ఎవరిదో చెయ్యి
పడింది. కళ్లు తెరిచాడు.

"నీళ్లు చేదుతానవా?" శాయన్న అడిగాడు.

"ఆఁ ఎందుకోమరి చేదమన్నరు" ముత్తడు రథాలనుంచి చూపుమరల్చ
కుండానే అన్నాడు.

"కొద్దిగాగు, అదే తెలుస్తది." శాయన్న అన్నాడు.

ఇంతలో జనంలో కోలాహలం చెలరేగింది. గంగాతీర్థం అందరికీ పంచుతున్నారని అర్థమైంది ముత్తడికి. ఎన్నో రోజుల్నించి ఎదురుచూస్తున్న క్షణం వచ్చింది. గంగాజలం సేవించి తానూ పునీతుడవాలి. భుజంమీద వున్న శాయన్న చేతిని తొలగించి రథంవైపుపరిగెత్తాడు.

అంతాజనం, విపరీతమైన జనం. గంగాజలం ఎవరికి చేదు? విష్ణువు పాదాల నుండి, శివుని శిరస్సు నుండి, భూమినీ, పాతాళాన్నీ పునీతం చేస్తూ ప్రవహించే గంగ, సర్వపాపహారిణి కావాలని వస్తే వద్దనేవాడెవడు!

జనం తోపిడి ఎక్కువైంది. ముత్తడు ముందుకు వెళ్ళలేకపోతున్నాడు. క్రమంగా వెనక్కి-వెనక్కి వెళ్ళి ఫర్లాంగుదూరంలో నిలబడిపోయాడు. జనం తగ్గేసూచనలేదు. రథాలు వచ్చి గంటసేపయింది. ఎవరెవరో ఉపన్యాసాలు దంచుతున్నారు. కార్యకర్తలు జనాన్ని తోస్తున్నారు.

ముత్తడు అంతా పరిశీలించాడు. తోసుకువెళ్ళేవారికి గంగాజలం లభిస్తోంది. దాన్ని ప్లాస్టిక్ సంచీల్లో నింపితెచ్చి బయట తనలాగే వెళ్ళలేనివాళ్ళకి అమ్ముతున్నారు. చివరికి గంగాజలం కూడా అమ్ముతున్నారనుకున్నాడు. ఇలాగే నిలబడితే తనకి ఆనీరు దొరకదు. కొనుక్కునే శక్తిలేదు. భుజబలం తప్ప తనకి ఏదీలేదు.

నడుంకున్న గోచీ కట్టుని గట్టిగా బిగించుకున్నాడు ముత్తడు. తలమీది రుమాలు తీసి గట్టిగా చుట్టుకున్నాడు. దూకుడుగా జనంలోకి దూసుకుపోయాడు. అంతా కీకారణ్యంలాంటి జనారణ్యం. తోసుకుని, పడేస్తు, పడుతూ లేస్తూ వెడుతున్నాడు. గోల! ఎవరో గుద్దారు. ఇంకెవరో తన్నారు, ఎందరో తిట్టారు. ఐనా లెక్కచెయ్యక గంగాజలం పంచేచోటికి వెళ్ళాడు ముత్తడు. అక్కడ కాస్త తెరిపిదొరికింది. ఇప్పుడు తాను జనంమధ్య ఉన్నాడు. కార్యకర్తలు లైనుగా అందర్నీ నిలబెట్టిస్తున్నారు.

ఆ లైనులో నిలబడి సర్దుకున్నాడు ముత్తడు. తలరుమాలు ఎక్కడో ఊడిపోయింది. గంగాజలం తాగనిదే వాడి తపన తీరేట్టులేదు. ఎన్ని రోజుల్నించి ఈ క్షణంకోసం ఎదురుచూశాడు! ఇది తప్పిపోతే? రథాలు ఎక్కువసేపు వుండవట! త్వరగా గంగాజలం సంపాదించాలి. జన్మ పునీతమవుతుంది.

ఆలోచనలో గంటగడిచిన సంగతి వాడికి తెలియలేదు. అక్కడో బల్ల మీద ఇత్తడి గంగాళం వుంది. దాంట్లోనించి రాగిపాత్రతో గంగాజలంపోస్తున్నాడో కార్యకర్త. దోసిలిపట్టి తాగుతున్నారు జనం. వెంటతెచ్చుకున్న పాత్రల్లోనూ, సీసాల్లోనూ, ప్లాస్టిక్ సంచీల్లోనూ నింపుకుంటున్నారు.

"తల్లీ గంగమ్మతల్లీ! ఇన్నాళ్ళకు నా దగ్గరికి వచ్చావా?" ఎవడో పారవశ్యంతో అంటున్నాడు.

ముత్తడు పులకించాడు. ఇంక ఐదారుగురి తర్వాత తనదే వంతు! వెంట ఏదన్నా పాత్ర తెచ్చుకోనందుకు విచారించాడు. ఇత్తడి గంగాళం మెరిసిపోతోంది. రాగిపాత్రలోంచి నీరు ధారగాపారి జీవుల్ని పావనంచేస్తోంది.

ముత్తడి కనుబొమలు అంతలోనే ముడిబడ్డాయి. అవతల చీకట్లోవున్న డ్రమ్ముల్లోని నీరు తన గూడెంవాళ్ళు ముంచి ఒక బండరాయి మీద పెడితే అది తీసుకుని బ్రాహ్మడొకడు గంగాళంలో అయిపోతున్నకొద్దీ నింపుతున్నాడు. అవి తానిందాకా తోడిన నీళ్ళే! ఆ నీటినే రాగిచెంబుతో పోస్తున్నాడు మరొకడు. తడిక అడ్డంగా వున్నందువల్ల సరిగా కన్పించటంలేదు. ముత్తడు లైనులోంచి బయటికి వచ్చి ఆ వైపు నడిచాడు. అక్కడి కార్యకర్తలు అడ్డబోయారుగాని ముత్తడు వారికి తెలిసినవాడు కావటంతో వదిలారు.

"అయ్యా! ఈ డ్రమ్ముల నీల్లు గిట్టుపోస్తున్నరేంది?" ఒక అయ్యగార్ని అడిగాడు.

అయ్యవారు ఉలిక్కిపడి "నీకెందుకురా ఇదంత? పో!" అన్నాడు. ఇంతలో ఇద్దరు కార్యకర్తలు వచ్చారు. "ఏండిరా? ఏంగావాలె!" అన్నారు.

"బాయినీల్లను గంగనీల్లని జెప్పి పోస్తాన్రు, పాపంగాదా? ముత్తడడిగాడు.

"పాపంలేదు ఏం లేదుగని ముందుగాల నువ్వు అవెనక్కుబో" కార్యకర్తలు మందలించారు. ముత్తడి జబ్బపట్టి వెనక్కితోశారు. వాడు కాస్త తూలి నిలదొక్కుకుని గంగాళం ఉన్న బల్లవైపు ఉరికి అదెక్కాడు. చెంబులో నీళ్ళు పోస్తున్న అయ్యగారు నివ్వెరపోయాడు. "ఆగన్రి, ఇది గంగనీరు కాదు. మున్సిపాల్టి బాయినీల్లు. నేనే చేదిపోసిన అసలు గంగ ఆ రథంల ఉన్నదిరాన్రి" అని బల్లదూకి రథంవైపు పరిగెత్తాడు.

కార్యకర్తలు ముత్తణ్ని వెంబడించి ఆపారు. వాడు ఆగలేదు. "గంగ పేరుతో మోసం చెయ్యకున్రి. నాకు అసలు గంగ నీరు కావాలె" ఎక్కడలేని బలంతో కార్యకర్తల్ని విదిలించుకున్నాడు.

జనంలో గోల బయల్దేరింది, రథం దగ్గిర ఉన్న పెద్దలకి విషయం అంతా చేరింది. ఇంతలో ముత్తడు రథం దగ్గరికి చేరాడు. కానీ ఆ జలాన్ని ఎలా సంపాదించాలో వాడికి అర్థంకాలేదు. ఒక ట్రక్కుమీద ఇద్దరు మనుషుల నిలువునా వుంది కలశం. దానిలోవుంది గంగాజలం.

రథంమీది ఉత్తరాది మనుషులంతా గోలగా అరిచారు. అక్కడ తెలుగు తెలిసిన వాడెవడు లేకపోవటంతో ముత్తడి మాటలు ఎవరికీ అర్థం కావటంలేదు. కానీ వాడేదో చేయాలని వచ్చాడని అందరికీ అర్థమైంది.

రథంమీది పూజార్లు హిందీలో ఏదో అంటూ ఇత్తడి బెత్తాలతో ముత్తణ్ని కొట్టారు. ముత్తడు రథంచుట్టూ మేక బోనుచుట్టూ తిరిగే పులిలా ఒగరుస్తూ తిరుగుతున్నాడు. వాడిమీద ఇత్తడి బెత్తాలూ, వెదురు కర్రలూ తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి.

కార్యకర్తలు కొందరికి కర్రలు లేకపోతే హిందూధర్మ జెండాలు పాతిన కర్రపీకి వాణ్ని కొట్టారు. హిందూధర్మ ఓంకారపుజెండా మాల ముత్తడి రక్తంతోతడిసి అతుక్కుపోయింది. ముత్తడు రెండునిమిషాలసేపు రథంచుట్టు గంగాజలం కోసం తిరిగి ఆఖరి ప్రయత్నంగా రథం ఎక్కటానికి ట్రక్కుమీద కాలు మోపాడు.

మాలవాడి స్పర్శతో గంగాజల భాండం అస్పృశ్యం కాకముందే వెదురు కర్రలు వాడినెత్తిన హిందూ ధర్మాన్ని మోపాయి. కళ్లలో మూడునక్షత్రాలు మెరిసి అడ్డంపడిపోయాడు ముత్తడు. స్పృహ తప్పినవాడి శరీరాన్ని చీకట్లోకి ఈడ్చారు కార్యకర్తలు.

ఆ గొడవకి జనంలో తొక్కిసలాట మొదలైంది. ఏం జరుగుతున్నదో చూడాలని అందరూ తోసుకుంటున్నారు. కేకలూ గోలా ఎక్కువయాయి. స్త్రీలూ పిల్లలు భయంతో అరుస్తున్నారు. ఒకర్నొకరు పట్టించుకునేస్థితి లేకుండా పోయింది. కార్యకర్తలకి జనాన్ని అదుపుచేయటం సాధ్యం కావటంలేదు. వెదురు కర్రలకి కట్టివున్న ట్యూబ్ లైట్లు ఆ సందడిలో ఆరిపోయాయి. ఆ వాతావరణానికి చీకటి గూడా తోడయేసరికి ఆ ప్రదేశం అంతా గంద్రగోళంగా తయారయింది.

"నిశ్శబ్దం. నిశ్శబ్దం. ఏమీలేదు, భయపడకండి. ఎక్కడివాళ్లక్కడే వుండండి" మైకులో ఎవరో అరుస్తున్నారు.

"సావధాన్-సావధాన్ కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. రథంచుట్టూ వలయాకారంలో నిలబడి అక్కడికెవరూ రాకుండా చూస్తున్నారు.

చీకట్లో ఏమీ తెలియడంలేదు. ఏంజరుగుతున్నదో అర్థంకాకుండా పోయింది. పావుగంట గడిచాక తిరిగి లైట్లు వెలిగాయి. జనం గాభరాగా తమ వాళ్లంతా ఉన్నారో తప్పిపోయారో చూసుకుంటున్నారు.

రథం ముందున్న వేదికపైన కార్యకర్తలు ఎవరిదో శరీరాన్ని పైకెక్కించి పడుకోబెడుతున్నారు. జనం ఆసక్తిగా అటువైపు తోసుకువెళ్ళారు.

"ఆగండి! నెమ్మది నెమ్మది. తొందరవద్దు" మైకులో తవగారు అంటున్నారు. జనం నెమ్మదిగా అటు కదిలారు.

"మహానుభావుడు! గంగాజలం కోసం ప్రాణాలనే అర్పించిన హైందవుడు! ఇతని ధర్మం మనకాదర్శం కావాలి! పాపం, తొక్కిసలాడటలో కింద పడి నలిగి దైవసాన్నిధ్యాన్ని చేరుకున్నాడు" తనగద్గద కంఠంతో అంటున్నాడు.

జనం ఆ పుణ్యాత్ముడి భౌతిక కాయాన్ని దర్శించాలని వేగిర పడ్డారు.

"ఇలాంటి మరణం అందరికీ సాధ్యంకాదు. కోరుకుంటే వచ్చేదికాదు. సాక్షాత్తూ గంగాదేవిముందు మరణించటం మోక్షాన్ని పొందుటయే." తవ మళ్ళీ ప్రకటించాడు.

"పరమ భక్తుడైన ఇతని శరీరాన్ని పవిత్ర గంగాజలంతో అభిషేకం చేయిస్తున్నారు. బతికుండగా పొందలేకపోయినా అతని భౌతిక కాయాన్నయినా గంగాజలధారల్లో తడుపుదాం" అని తవ స్వయంగా బిందెలోని గంగాజలం ముత్తడి మృత దేహంమీద పోశాడు. అతడి తర్వాత పెద్దలందరూ తలా చెంబెడు గంగాజలం ఆ శవంమీద పోశారు.

మృతదేహాన్ని బంతిపూలదండతోనూ. కుంకుమతోనూ, అలంకరించారు. ఒక కాషాయవస్త్రాన్ని శరీరంమీద గాయాలు కన్పించకుండా కప్పారు.

బ్రాహ్మణులు ఏవో మంత్రాలు చదువుతూ పవిత్ర జలాలు ఆ దేహం మీద చిలకరిస్తుంటే జనం మృతదేహానికి నమస్కరిస్తూ అక్కడవున్న హుండీలో చేతనైనంత డబ్బువేస్తున్నారు.

పోలీసు రాజ్యంలో సామాజిక విలువలు

మానవ సమాజం కాలక్రమంలో సంకీర్ణమవుతుంది. శ్రమలోనూ ఉత్పత్తిలోనూ వైవిధ్యం పెరిగే కొద్దీ కొత్త కొత్త విలువలూ, ఆదర్శాలూ సంప్రదాయాలూ, ఆచారాలూ పుట్టుకొస్తాయి. కొత్త సామాజిక సంప్రదాయం ఏదయినా అప్పటి ఒక వర్గం అవసరాలను సాధించడానికే పుడుతుంది. కాని ఈ సంకుచితమైన ప్రయోజనంతో బాటు ఒక విలువనూ ఆదర్శాన్నీ గూడ అది చరిత్రలోకి తీసుకొస్తుంది. పశువులను చంపితినడంకోసం పోషించిన దశను దాటి, పశువులను పాడికోసం వ్యవసాయం కోసం పోషించిన దశ వచ్చేసరికి "గొడ్లను చంపడం పాపం" అనే ఆచారం పుట్టుకొచ్చింది. ఇది వ్యవసాయదారుల అవసరాలను కాపాడే ఆచారమే, కాని దీనితోబాటు చరిత్ర లోనికి "జీవహింస తప్పు" అనే అస్పష్టమైన విలువ పుట్టుకొచ్చింది. రాజుల నిరంకుశత్వం యూరప్‌లో వ్యాపార వర్గాల విస్తరణకు అవరోధమయి వాళ్ళ అవసరాలను తీర్చడం కోసం ఎన్నికలూ పార్లమెంటులూ పుట్టుకొచ్చాయి. అయితే వాటితోబాటు ప్రాతినిధ్యపాలన అనే విలువ చరిత్రలోకి వచ్చింది.

కొందరు కార్యకర్తలు భజన ప్రారంభించారు. "భారతమాతాకుజై, గంగామాతాకుజై" అనే నినాదాలు చెలరేగాయి. అంతవరకూ ఏం జరిగిందో తెలియని ప్రజలు గంగాజలంకోసం క్యూలో నడుస్తూనే వున్నారు. ముత్తడి దేహాన్ని దర్శిస్తూనే వున్నారు.

వేదికమీద పక్కగావున్న అవ "సూటరెండు" అన్నాడు.

"ఏమిటి?" తవ అడిగాడు.

"వాడి ఒంటిమీద దెబ్బలు" అని చెప్పాడు.

తవ ఉలిక్కిపడి అవ చెయ్యి గట్టిగానొక్కాడు. అవ మళ్ళా ఏంవాగు తాడోనని మైక్ ముందుకు నడిచి "ప్రజలారా! భారతమాత తన బిడ్డణ్ని ఒడిలో లాలిస్తున్నది. రండి పవిత్రజలంకోసం ప్రాణాలను బలిపెట్టిన అతడిని దర్శిం చండి" అని ప్రారంభించాడు.

కాస్త దూరంగా నిలబడ్డ సాయన్న కోపంగా పళ్ళు పటపటకొరికాడు.